RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక



CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 286 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 22-8- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 286 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 22-8-2026 | PAGES: 8 | PRICE : 2/- RS


## నేడు ఉత్తరాంధ్రలో చంద్రబాబు పర్యటన.. బిజీబిజీగా షెడ్యూల్

నేడు అనకాపల్లి, విజయనగరం, విశాఖ జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

అనకాపల్లిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్రజా వేదిక కార్యక్రమాల్లో పాల్గొననున్న సీఎం

విశాఖలో జరగనున్న బ్రిక్స్ యువజన, క్రీడల మంత్రుల సమావేశానికి హాజరు

ఒకే రోజు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలతో పాటు అంతర్జాతీయ సదస్సులోనూ భాగస్వామ్యం



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శనివారం ఉత్తరాంధ్రలో పర్యటించనున్నారు. ఒకే రోజు అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. స్థానిక ప్రభుత్వ కార్యక్రమాల నుంచి అంతర్జాతీయ స్థాయి బ్రిక్స్ సదస్సు వరకు ఈ పర్యటనలో ఆయన పాల్గొననుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యమంత్రి పర్యటన వివరాల ప్రకారం, శనివారం ఉదయం అమరావతి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, మొదట

తరువాయి 2లో..

## ఆయుర్వేద చికిత్స కోసం కేరళ వెళుతున్న పవన్ కల్యాణ్

భుజం నొప్పికి చికిత్స కోసం కేరళకు పవన్ కల్యాణ్


శస్త్రచికిత్స తర్వాత విశ్రాంతి

పెద్దగా తీసుకోకుండా విధుల్లో చేరిక

భుజానికి వాపు, జ్వరం రావడంతో వైద్యుల సూచన

రేపు కేరళకు బయలుదేరనున్న ఉపముఖ్యమంత్రి

ఆయుర్వేద చికిత్సతో పూర్తిస్థాయిలో కోలుకోవడమే లక్ష్యం



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన

తరువాయి 2లో..


## 22 మంది భారతీయులు ఉన్న రెండు నౌకలు హైజాక్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

యెమెన్, సోమాలియా తీరాల్లో వేర్వేరు ఘటనల్లో.. 22 మంది భారతీయులతో ప్రయాణిస్తోన్న రెండు వాణిజ్య నౌకలను సముద్రపు దొంగలు హైజాక్ చేశారు (ఝుతీస్త్రశీ ాాష్ట్రఅజూం ఎఅయిఝుఎెవస). ఈ విషయాన్ని సోమాలియా షిప్పింగ్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆగస్టు 17న సోమాలియా (ాశీఝుశ్రీఋు) తీరంలో కామెరూన్ పతాకంతో వెళ్తోన్న 'లుటుఫ్' అనే కార్గో నౌక హైజాక్ అయ్యింది. తుర్కియే ఆయుధాలను తరలిస్తోన్న ఆ నౌకలో 10 మంది సిబ్బంది ఉండగా.. వారిలో ఆరుగురు భారతీయులు కాగా.. మిగిలిన వారు తుర్కియే, జార్జియా, సెర్బియాకు చెందినవారు. మొగదిషూలోని సైనిక శిక్షణా

తరువాయి 2లో..




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రేడియో నుంచి సినిమా వరకూ... కథానాయిక నుంచి... సినిమాల్ని నిలబెట్టిన సహాయ పాత్రల వరకూ... తక్కువ పారితోషికం అందుకోవడం నుంచి... సినిమాల్ని నిర్మించే వరకూ... 'నువ్వు సినిమాలకు పనికి రావు' అన్న మాట నుంచి... 'శెభాష్...' అని ఆ దర్శకుడే మెచ్చుకునే వరకూ... తెలుగు నుంచి హిందీ వరకూ... 18 ఏళ్ల వయసు నుంచి... తన 90వ ఏట వరకూ... ఇలా వినోద రంగంలో ఎన్నో తరాలకు, మరెన్నో మలుపులకు, కొండంత అనుభవానికీ సాక్ష్యంగా నిలుస్తూ... చిత్రసీమలో సుదీర్ఘమైన ప్రయాణం చేసిన అలుపెరగని 'బాటసారి'... షావుకారు జానకి. శంకరమంచి జానకి... ఈ పేరు చెబితే గుర్తు పట్టేవాళ్లు అరుదు. అదే షావుకారు జానకి అంటే మాత్రం మా నటే అంటూ దక్షిణాది ప్రేక్షకులు ఆమెని సొంతం చేసుకుని మాట్లాడతారు. సినిమాలు చాలామంది ఇంటి పేర్లని మార్చేశాయి. తెలుగులో మొట్ట మొదట అలా జరగడం మాత్రం జానకి విషయంలోనే. ఆమెకు తొలి విజయం అందించిన 'షావుకారు' సినిమానే ఆమె ఇంటి పేరైంది. 'కన్యాశుల్కము'

తరువాయి 2లో..

## వైకాపా ఎంపీ అవినాష్ నివాసంలో రూ.24లక్షల నగదు సీజ్

**హైదరాబాద్, సిటిజన్ టైమ్స్**

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు ముగిశాయి. సీబీఐ కేసు ఆధారంగా హైదరాబాద్, కడప సహా ఏడు చోట్ల ఈడీ తనిఖీలు చేపట్టింది. ఈ కేసులోని కీలక నిందితుల నివాసాల్లో



తరువాయి 2లో..

## పాక్ తక్షణ ముప్పు.. చైనా భవిష్యత్ సవాలు

### ఆర్మీ మాజీ చీఫ్ నరవణె

చైనాను శత్రువుగా కాకుండా

పోటీదారుగా చూడాలన్న నరవణె

చైనాతో విభేదాల పరిష్కారానికి చర్చలే

తొలి మార్గమని సూచన

దౌత్యానికి బలమైన సైనిక శక్తి తోడుగా ఉండాలని వ్యాఖ్య

పొరుగు దేశాల్లో అశాంతి భారత్‌కూ ముప్పేనని హెచ్చరిక

శాంతి కోసం కూడా యుద్ధ సన్నద్ధత అవసరమని స్పష్టీకరణ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

భారత్‌కు ప్రస్తుతం పాకిస్థాన్ నుంచి ఉగ్రవాద ముప్పు ఎక్కువగా ఉందని మాజీ ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ నరవణె అన్నారు. అయితే రాబోయే రోజుల్లో భారత్‌కు చైనానే ప్రధాన పోటీదారుగా మారుతుందని చెప్పారు. రాజకీయాలు, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, సైనిక రంగాల్లో చైనాతో పోటీ పెరుగుతుందని అంచనా వేశారు. తన కొత్త పుస్తకం 'ది క్యూరియస్ అండ్ ది క్లాసిఫైడ్' ఆవిష్కరణ కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. పాకిస్థాన్, చైనాలతో భారత్ గతంలో యుద్ధాలు చేసిందని గుర్తు చేశారు. రెండు దేశాలతోనూ సరిహద్దు సమస్యలు ఇంకా ఉన్నాయని తెలిపారు. ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతు

తరువాయి 2లో..


## ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను: నారా లోకేశ్

విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర ఆవేదన

ఒక తండ్రిగా ఆ తల్లిదండ్రుల బాధను ఊహించలేకపోతున్నానని వ్యాఖ్య

పాఠశాలల్లో శారీరక దండనలకు చోటులేదని స్పష్టీకరణ

ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

పాఠశాల విద్యార్థి ప్రణయ్ తేజ్ మృతి ఘటనపై ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, క్రమశిక్షణ పేరుతో చిన్నారులపై హింసకు పాల్పడటాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన తన సోషల్

తరువాయి 2లో..

## పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..

పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ కోసం డిమాండ్

పెల్లెట్ గన్ బాధితుడితో పోలీస్ స్టేషన్‌కు రాహుల్ గాంధీ



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పెల్లెట్ గన్ గాయాల వ్యవహారంలో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఢిల్లీలో ఆందోళనకు దిగారు. జులై 20న జరిగిన జెన్-జీ విద్యార్థుల నిరసనల్లో పెల్లెట్ గన్ గాయాలయ్యాయని ఆరోపిస్తున్న సాహిల్ లోచాబ్‌ను వెంటబెట్టుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అనంతరం సీనియర్ పోలీస్ అధికారి

తరువాయి 2లో..

## తిరుమల అడవుల్లోకి 'రోబో డాగ్'..

భక్తుల భద్రతకు టీటీడీ హైటెక్ సొల్యూషన్!


తిరుమలలో వన్యప్రాణుల కదలికల పర్యవేక్షణకు రోబో డాగ్

భక్తుల భద్రతను పటిష్టం చేసేందుకు టీటీడీ ఆధునిక సాంకేతికత పరిశీలన

అడవుల్లోకి మనుషులు వెళ్లలేని చోట రోబోలతో నిఘా పెట్టే యోచన

చిరుతల సంచారాన్ని గుర్తించి కంట్రోల్ రూమ్‌కు లైవ్ వీడియో, అలర్ట్స్

శబ్దాలు, కాంతితో జంతువులను తిరిగి అడవిలోకి పంపే సౌకర్యం



**తిరుమల, సిటిజన్ టైమ్స్**

శేషాచలం అడవుల్లో వన్యప్రాణుల కదలికలను పర్యవేక్షించడం, భక్తుల భద్రతను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధునిక సాంకేతికత వైపు అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, ప్రమాదకరమైన అటవీ ప్రాంతాల్లో మనుషులకు బదులుగా నిఘా పెట్టేందుకు 'క్వాడ్రుపెడ్ రోబోట్' (నాలుగు కాళ్ల రోబో డాగ్) వినియోగంపై దృష్టి సారించింది. గురువారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహం వద్ద ఈ రోబో డాగ్ పనితీరును టీటీడీ అదనపు ఈవో శ్రీ సి.హెచ్. వెంకయ్య

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# పాత వ్యూహం రద్దు... జనసేన కొత్త వ్యూహం స్ట్రాంగ్

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఓడించేందుకే ఒక వ్యూహాన్ని అనుసరించామని జనసేన చెబుతోంది. అది పాత వ్యూహమని అంటోంది. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల వ్యూహం వేరు. ఇపుడు సార్వత్రిక ఎన్నికల్లో వ్యూహం దానికి భిన్నంగా ఉంటుంది అని గట్టిగానే చెబుతోంది. ఈసారి వ్యూహం మాత్రం జన సైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా ఉండబోతోంది అని అంటోంది. జన సైన్యం ఆత్మ గౌరవాన్ని నిలిపేలా స్థానిక సంస్థల ఎన్నికలను ధీటుగా ఎదుర్కొందామని జనసేన పిలుపు ఇచ్చింది. ఇక గతంలో 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో వైసీపీనే ఎదిరించి అప్పటి స్థానిక ఎన్నికల్లో ధైర్యంగా నిలిచిన జనసేన శ్రేణుల స్ఫూర్తినే తీసుకుని ఈసారి ముందుకు సాగుదామని జనసేన అధినాయకత్వం అంటోంది. ఇక గత ఎన్నికలకు భిన్ననగ స్థానిక ఎన్నికల్లో జనసేనకు స్థానాలు ఉంటాయని కూడా చెబుతోంది. రాష్ట్ర శాసన సభ ప్రాంగణంలోని ఉప ముఖ్యమంత్రి ఆఫీసులో జరిగిన జనసేన శాసన సభ పక్షం సమావేశంలో పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ఇతర పార్టీ నేతలతో స్థనిక ఎన్నికల వ్యూహం మీద సుదీర్ఘంగా చర్చించారు. ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు రెడీ కావాల్సిందే అని పవన్ పార్టీ ఎమ్మెల్యేలను నేతలకు కోరారు. జనసేన అనుసరించే వ్యూహం విధి విధానాల కోసం ఒక ప్రత్యేక కమిటీని నియమిస్తామని పవన్ చెప్పారు. వైసీపీ హయాంలో కనీసం నామినేషన్లు వేసే పరిస్థితులు లేకుండా ఉన్నా కూడా వారిని ఎదిరించి పోటీకి నిలిచిన జనసేన నాయకులు, వీర మహిళల స్ఫూర్తిని ఎప్పుడూ విడిచిపెట్టబోమని పవన్ స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేలు కేవలం వారి నియోజక వర్గాలకే పరిమితం కాకుండా, వారి ప్రాంతంలో జనసేన బలబలాలను బేరీజు వేసి పోటీ చేసేందుకు తగిన స్థానాలను గుర్తించి పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ఇవ్వాలని పవన్ కోరారు. ఈసారి కూడా జనసైనికులు గట్టిగా బరిలో నిలిచి ఉంటే పదవులు కచ్చితంగా దక్కుతాయని పవన్ అన్నారు. అప్పుడు 21 సీట్లకే పరిమితం కావడం వెనక వైసీపీ దారుణ పాలన ఉందని గుర్తు చేశారు. ఆ వ్యూహం కేవలం స్థానిక ఎన్నికల వరకే అని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కొత్త వ్యూహం అన్నారు. ఇక స్థానిక ఎన్నికలకు ప్రాంతాలవారీగా ఆ ప్రాంత రాజకీయ సామాజిక పరిస్థితులను బట్టి వ్యూహాలు ఉంటాయని ఆయన చెప్పుకొచ్చారు. పార్టీ శ్రేణుల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని, రాజకీయంగా వారిని బలోపేతం చేసే విధంగా ముందుకు వెళ్దామని పవన్ చెప్పారు. అంతే కాదు రాజకీయంగా వారికి మెరుగైన అవకాశాలు కల్పిద్దామని అన్నారు. జనసేన స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అని అంటున్నారు. కనీసంగా ముప్పయి శాతం సీట్లలో పోటీకి పొత్తుల రూపేణా సర్దుబాట్లు జరగాలని కోకుంటోంది. ఈ లెక్కన చూస్తే మండల పరిషత్తులు కనీసంగా 200 దాకా జెడ్పీలు 10 దాకా మేయర్ పదవులు అరడజన్ దాకా తీసుకోవాలని జనసేన ఆలోచిస్తోంది అని అంటున్నారు. అలాగే పంచాయతీలు ఏపీవ్యాప్తంగా 13 వేల దాకా ఉన్నాయి. అందులో మూడు వేల దాకా తమ పక్షం వచ్చేలా చూడాలని ఆలోచిస్తోంది. మొత్తానికి జనసేన స్ట్రాంగ్ గానే ఉంది. పాత వ్యూహం రద్దు అంటోంది. కొత్త వ్యూహంతో కూటమిలో ఎన్ని సీట్లు దక్కించుకుంటుందో చూడాల్సి ఉంది.

# నటనలో... అనుభవంలో... నిజమైన షావుకారు

బుచ్చమ్మ... 'సంసారం ఒక చదరంగం' చిలకమ్మ... 'రోజులు మారాయి' అన్న ఓ గడుసైన అమ్మాయి... 'మంచి మనసులు' సినిమాతో అంధురాలిగా పాత్రలో ఒదిగిపోయిందీ ఆమే! 'శ్రీ వేంకటేశ్వర మహాత్యం'లో సోది చెప్పి మైమరపించిన ఎరుకలసానీ ఆమే!! 'మంచి కుటుంబం'లో ఆమె ఇంగ్లిష్ మాట్లాడుతుంటే చూసి అభిమానులైన ప్రేక్షకులు ఎంతోమంది! 'డాక్టర్ చక్రవర్తి'లో అసూయపడే భార్యగానూ కనిపించి ఆమె పంచిన వినోదాన్ని అంత సులభంగా మర్చిపోగలమా?ఇలా ఎన్నో పాత్రల్లో ఒదిగిపోయిన అచ్చ తెలుగు నటి షావుకారు జానకి!

**ఆర్థిక కష్టాలే.... సినిమాల్లోకి తెచ్చాయి**

జానకి 1945లో మద్రాసులో తన చెల్లెలు కృష్ణకుమారితో కలిసి ఆలిండియా రేడియో చిన్న పిల్లల కార్యక్రమం బాలానందంలో పాల్గొనేందుకు వెళ్లారు. అక్కడ ఆ ఇద్దరూ పాడిన పాట వాళ్ల జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ తర్వాత రేడియో నాటకాల్లో అవకాశాల్ని అందుకున్నారు. మరోవైపు అక్కాచెల్లెళ్లిద్దరూ నాట్యంలోనూ ప్రావీణ్యం సంపాదించారు. రేడియోలో జానకి గళం విన్న దర్శకనిర్మాత బి.ఎన్.రెడ్డి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనే కె.వి.రెడ్డి దర్శకత్వం వహిస్తున్న 'గుణసుందరి కథ'లో నటించమని సిఫారసు చేయగా, తల్లిదండ్రులు సినిమాలపై అభ్యంతరం చెబుతూ పదిహేనో ఏటే శంకరమంచి శ్రీనివాసరావుకు ఇచ్చి వివాహం జరిపించారు. పెళ్లి తర్వాత ఆర్థిక కష్టాలు చుట్టుముట్టడం, భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకుని జానకి మళ్లీ సినిమాలవైపు దృష్టిపెట్టారు. అప్పటికే ఓ బిడ్డకు జన్మనిచ్చారు. భర్త, ఒడిలో బిడ్డతోపాటే వెళ్లి దర్శకనిర్మాత బి.ఎన్.రెడ్డిని కలిసి అవకాశాన్ని అడిగారు. ఆయన 'షావుకారు' చిత్రం తీసే ప్రయత్నాల్లో ఉన్న నిర్మాతలు నాగిరెడ్డి, చక్రపాణిలను కలవమని సూచించారు. అలా తొలి చిత్రంతోనే బి.ఎన్.రెడ్డి సిఫారసుతో కథానాయికగా అవకాశాన్ని అందుకున్నారు జానకి. ఎల్వీ ప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన 'షావుకారు' ఎన్టీఆర్‌కి, ఎస్వీ రంగారావుకు రెండో చిత్రం కావడం విశేషం. మెలోడ్రామాలకీ, సుదీర్ఘమైన సంభాషణలకీ, పెద్ద కథలకీ భిన్నంగా అత్యంత సహజమైన కథతో రూపొందిన ఈ చిత్రం తెలుగు సినిమాని మలుపు తిప్పింది. ఇందులో సుబ్బులు అనే పల్లెటూరి యువతిగా షావుకారు నటించి మెప్పించారు.

**పట్టు వదలకుండా...**

'షావుకారు'తో జానకికి పేరైతే వచ్చింది కానీ, ఆ తర్వాతే అవకాశాలు ముఖం చాటేశాయి. ఆ సమయంలో దర్శకుడు కె.వి.రెడ్డిని కలవగా 'నీకు ఇక సినిమాలు రావు, హీరోయిన్‌గా పనికిరావు. తిరిగి వెళ్లిపోవడం మంచిద'ని చెప్పారట. ఆ మాటలతో నిరుత్సాహ పడకుండా మరింత పట్టుదలతో ప్రయత్నాలు చేసి, 'ముగ్గురు కొడుకులు' సినిమాలో అవకాశాన్ని అందుకున్నారు. 1955లోనే ఆమె వివిధ భాషల్లో 11 సినిమాల్లో నటించి బిజీ కథానాయికగా మారారు. ఆ తర్వాత వెనుదిరిగి చూడలేదు. 'అక్కా చెల్లెలు' చిత్రంలోని 'పాండవులు పాండవులు తుమ్మెదా...' అంటూ సాగే పాటలో షావుకారు జానకి అభినయం ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఆ రోజుల్లో థియేటర్లు మార్మోగిపోయేలా చేసింది ఆ పాట. కథానాయిక పాత్రలపైనే కాకుండా, సహ నటిగానూ ఆమె తిరుగులేని ప్రభావం చూపించారు. 'ఉండమ్మా బొట్టు పెడతా', 'ఖైదీ బాబాయ్', 'వేములవాడ భీమ కవి', 'తాయారమ్మ బంగారయ్య' తదితర చిత్రాల్లో ఆమె నటన ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. 'గోపాలరావు గారి అమ్మాయి', 'బెజవాడ బెబ్బులి', 'గీతాంజలి'తోపాటు 'బాబు బంగారం', నందినీరెడ్డి దర్శకత్వం వహించిన 'అన్నీ మంచి శకునములే' చిత్రాల్లోనూ ఆమె మెరిశారు. తెలుగు కంటే ఆమె తమిళం, కన్నడ భాషల్లోనే ఎక్కువగా సినిమాలు చేశారు. ఓ వేడుకలో రచయిత ఆరుద్ర మాట్లాడుతూ 'జానకి త్యాగరాజ కీర్తనలాంటిది. త్యాగరాజస్వామి తెలుగువాడైనా, ఆయన కీర్తనలకు తమిళులే ఎక్కువ ప్రాచుర్యం కల్పించారు. అలా జానకి ప్రతిభకి ఎక్కువ గుర్తింపు తమిళ చిత్రాల నుంచే లభించింద'ని ప్రశంసించారట. 'శ్రీవ్వటంకటేశ్వర మహాత్యం' సినిమా చేస్తున్నప్పుడు షావుకారు జానకి నటనని మెచ్చుకుని, గతంలో పనికి రావు అన్న మాటని వెనక్కి తీసుకుంటున్నట్టు దర్శకుడు కె.వి.రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేసుకునేవారు జానకి.

**తిరుగులేని ప్రభావం...**

సినిమాల్లో కొనసాగుతూనే, నాటకరంగంతో అనుబంధాన్ని కొనసాగించారు జానకి. సినిమాల్లో తనకు నప్పే సాంఘిక చిత్రాలు, పాత్రలతోనే ప్రయాణం చేశారు జానకి. 'వరూధిని పరిణయం' సహా బుల్లితెరపై ప్రసారమైన పలు ధారావాహికల్లోనూ మెరిశారు. కె.బాలచందర్ దర్శకత్వంలో 'కావియతలైవి'తోపాటు, 'రంగరాట్టినమ్' అనే మరో తమిళ చిత్రాన్నీ నిర్మించారు. ఆమె తండ్రి చనిపోయాక చెల్లెలు కృష్ణకుమారి సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. కృష్ణకుమారి స్వశక్తితో అవకాశాల్ని అందుకుంటూ జానపద, చారిత్రక చిత్రాలతో ప్రముఖ కథానాయికగా పేరుతెచ్చుకున్నారు.

**వ్యాఖ్యాతగానూ మెప్పించి**

బెంగళూరు సమీపంలోని ఓ గ్రామంలో తన చెల్లెలు కృష్ణకుమారి ఎస్టేట్‌లో 8 ఎకరాల పొలం తీసుకుని అందులోనే నివాసం ఏర్పరుచుకుని స్థిరపడ్డారు షావుకారు జానకి. తన చివరి రోజుల్లో మనవలు, మనవరాళ్లతో అక్కడే గడిపారు. షావుకారు జానకి నటి అయ్యాక భర్తతో విభేదాలొచ్చి దూరమైనా సరే... మానవతా దృక్పథంతో మెలుగుతూ, ఆయన చివరి రోజుల్లో అండగా నిలిచారు జానకి. వివిధ భాషలపై పట్టున్న జానకికి మంచి వక్తగా కూడా పేరుంది. పలు కార్యక్రమాలకు ఆమె వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఆమె వాక్చాతుర్యం మెచ్చి 'జయసింహ' అనే సినిమాలో వహీదా రెహమాన్ పోషించిన పాత్రకి జానకితో డబ్బింగ్ చెప్పించారు ఎన్టీఆర్. తన ప్రతిభని బహురూపాలుగా ప్రదర్శించిన షావుకారు జానకి చంటి బిడ్డతోపాటు కెమెరా ముందుకొచ్చి... తన 90 ఏళ్ల వయసు వరకూ నటించారు.

**గాంధీజీకి సేవ.. తనకే దక్కిన అదృష్టం**

మహాత్మాగాంధీకి సేవ చేసే అవకాశం లభించడాన్ని తనకు దక్కిన గొప్ప అదృష్టమని గర్వపడేవారు జానకి. ఆమె 1946లో ఆంధ్ర మహిళా సభలో చదువుకునే రోజుల్లో ఓసారి హిందీ ప్రచార సభ కోసం గాంధీ అక్కడికి వచ్చారు. దీంతో ఆయనకు భోజన, వసతి సౌకర్యాలు చూసుకునేందుకు జానకితో పాటు మరికొందర్ని దుర్గాబాయి దేశ్‌ముఖ్ వాలంటీర్లుగా నియమించారు. అలా ఆ సమయంలో మహాత్మా గాంధీకి సేవ చేసుకునే అదృష్టం తనకు లభించిందని షావుకారు జానకి ఎన్నో సందర్భాల్లో గుర్తు చేసుకున్నారు.

**దేవదాసు చేసుంటే.. కెరీర్ మరోలా**

సావిత్రి సినీ ప్రయాణాన్ని మలుపు తిప్పిన సినిమాల్లో 'దేవదాసు' ఒకటి. ఆమె.. ఏఎన్నార్ జంటగా నటించిన ఈ సినిమా 1953లో విడుదలై సంచలన విజయాన్ని అందుకుంది. అందులో సావిత్రి పోషించిన పార్వతి పాత్ర తనకెంతో పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది. అయితే నిజానికి ఈ పాత్రకు తొలుత అనుకున్నది షావుకారు జానకినే. ఆ పాత్ర కోసం ఆమెకి అవసరమైన కాస్ట్యూమ్స్ సిద్ధం చేయించి.. "ఓ.. దేవదా" పాట కోసం ఏఎన్నార్‌తో కలిసి వారం పాటు రిహార్సల్స్ కూడా జరిపారు. కానీ, తీరా ఆ పాట చిత్రీకరణ జరగబోతుందనగా.. 'మీరు సినిమాలో లేరు' అని నిర్మాత డీఎల్ నారాయణ ఆమెకి ఓ ఉత్తరం పంపడంతో ఆమె ఒక్కసారిగా షాక్ అయిందట. ఆఖరి నిమిషంలో ఆ పాత్రని పోగొట్టుకున్నానన్న బాధలో పదిరోజుల పాటు సరిగా భోజనం చేయకుండా అలా ఏడుస్తూ ఉండిపోయిందట. ఒకవేళ తాను 'దేవదాసు'లో నటించి ఉంటే తన సినీ ప్రయాణం మరోలా ఉండేదని జానకి ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నారు.

**అలా... ఆ పేరు**

షావుకారు జానకి... ఈ పేరుకి ప్రాచుర్యం కల్పించిన వాళ్లు తమిళ సినీప్రియులే. జానకి తమిళులకు 'సౌకార్' సినిమాతో సుపరిచితమయ్యే నాటికే.. ఆ పరిశ్రమలో వీఎన్ జానకి అనే మరో నటి ఉండేవారు. ఆమె ఆ తర్వాతి కాలంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, నటుడు ఎంజీ రామచంద్రన్‌కు ధర్మపత్ని అయ్యారు. అలా జానకి వచ్చే నాటికే తమిళంలో అదే పేరుతో మరో నటి ఉండటంతో.. తడబాటు లేకుండా ఉండేందుకు శంకరమంచి జానకిని తమిళ ప్రేక్షకులు 'సౌకార్' జానకి అని పిలవడం మొదలు పెట్టారు. అలా తెలుగు ప్రేక్షకులకు కూడా ఆమె షావుకారు జానకిగానే గుర్తుండిపోయారు.

రిస్కీ షాట్.. ఓన్లీ సింగిల్ టేక్

షావుకారు జానకికి మంచి పేరు తెచ్చి పెట్టిన వినోదాత్మక పాత్రల్లో 'తిల్లు – ముల్లు' (1981) చిత్రంలోని మీనాక్షి పాత్ర ఒకటి. బాలచందర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో జానకిది ఓ వినూత్నమైన కామెడీ పాత్ర. గతంలో హిందీ నుంచి వచ్చిన ఇందులో ఓ ఇంటి పైపుల్ని పట్టుకుని పైకి చేరే రిస్కీ షాట్ ఒకటుంది. ఆ సన్నివేశంలో జానకి ఎంతో సాహసోపేతంగా పైపుల సాయంతో స్వయంగా పైకి ఎక్కి సింగిల్ టేక్‌లోనే దాన్ని పూర్తి చేసి ఆశ్చర్యపరిచారు. ఇది తన సినీ ప్రయాణంలో చేసిన సవాల్‌తో కూడిన సన్నివేశాల్లో ఒకటని జానకి ఓ దర్భంలో పంచుకున్నారు. వెండితెరపై నాయికగా, సహాయ నటిగా, నిర్మాతగా బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శించిన ఆమె.. చెన్నైలో కొంత కాలం

# ప్రణయ్ తేజ్ ఘటన నుంచి ఇంకా తేరుకోలేకపోతున్నాను: నారా లోకేశ్

మీడియా ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "ఒక తండ్రిగా, విశాఖ చిన్నారి ప్రణయ్ తేజ్‌కు జరిగిన ఘటన గురించి నేను ఇంకా తేరుకోలేకపోతున్నాను. అతని తల్లిదండ్రులు అనుభవిస్తున్న బాధను ఊహించుకోలేను. మన పాఠశాలల్లో శారీరక దండనలకు ఏమాత్రం చోటు లేదు. క్రమశిక్షణ పేరుతో ఏ బిడ్డపైనా హింస జరగకూడదు" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ దురదృష్టకర ఘటనపై ఇప్పటికే పూర్తిస్థాయి విచారణకు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. బాధ్యులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ తీవ్రమైన దుఃఖ సమయంలో ప్రణయ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు లోకేశ్ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి ఇండియా టుడేలో ప్రచురితమైన కథనాన్ని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకుంటూ లోకేశ్ ఈ విధంగా స్పందించారు. మంత్రి ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు ఈ ఘటనపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

# తిరుమల అడవుల్లోకి 'రోబో డాగ్'..

చౌదరి, ఇతర అటవీ, భద్రతా విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా మనుషులు సులభంగా వెళ్లలేని, ప్రమాదకరమైన కొండ ప్రాంతాల్లో వన్యప్రాణుల సంచారాన్ని గుర్తించడానికి ఈ రోబోట్‌ను ఎలా ఉపయోగించవచ్చో అడిగి తెలుసుకున్నారు.

రోబో ప్రత్యేకతలు ఇవే..

ఈ రోబో డాగ్ అత్యాధునిక టెక్నాలజీతో పనిచేస్తుంది. ఇందులో ఆప్టికల్ కెమెరా, థర్మల్ ఇమేజింగ్ కెమెరా, 360 డిగ్రీల లైడార్ సెన్సార్ వంటివి ఉన్నాయి. వీటి సహాయంతో చిమ్మచీకటిలో, దట్టమైన పొగమంచులో కూడా వన్యప్రాణుల కదలికలను స్పష్టంగా గుర్తించవచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థ సాయంతో ఇది జంతువులు, మనుషులు, వాహనాలను వేర్వేరుగా గుర్తుపట్టగలదు.

భక్తులకు భద్రత ఎలా?

గతంలో అలిపిరి–తిరుమల నడక మార్గాల్లో చిరుతల సంచారం భక్తులను ఆందోళనకు గురిచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నడకదారికి సమీపంలోని అటవీ ప్రాంతాల్లో చిరుత లేదా ఇతర జంతువుల కదలికలను ఈ రోబో గుర్తించిన వెంటనే, జియో–ట్యాగ్‌తో కూడిన హెచ్చరికను కంట్రోల్ రూమ్‌కు పంపుతుంది. అదే సమయంలో లైవ్ వీడియో, థర్మల్ ఫీడ్‌ను భద్రతా సిబ్బందికి చేరవేస్తుంది. దీంతో వారు వెంటనే స్పందించి భక్తులను అప్రమత్తం చేయడానికి వీలవుతుంది.

అంతేకాకుండా, వన్యప్రాణులు భక్తులు తిరిగే ప్రాంతాల వైపు వస్తుంటే, రోబోట్‌లోని సౌండ్, లైట్ యూనిట్లను ఉపయోగించి వాటిని భయపెట్టి, ఎలాంటి హాని తలపెట్టకుండా తిరిగి అడవిలోకి పంపే అవకాశాలను కూడా అధికారులు పరిశీలించారు. ఇది మనుషులు–వన్యప్రాణుల మధ్య ఘర్షణను నివారిస్తుంది. ఈ రోబోటిక్ వ్యవస్థను ఇప్పటికే ఉన్న కెమెరా ట్రాప్‌లు, ఫుట్ పెట్రోలింగ్‌కు ప్రత్యామ్నాయంగా కాకుండా, వాటికి అదనపు బలంగా వినియోగించాలని టీటీడీ భావిస్తోంది. అవసరాన్ని బట్టి, జంతువుల సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దీన్ని మొబైల్ మానిటరింగ్ యూనిట్‌గా మోహరించనున్నారు. దీని ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి, వన్యప్రాణుల ప్రవర్తనను అర్థం చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో భద్రతా చర్యలను మరింత మెరుగుపరచవచ్చని అధికారులు తెలిపారు.

# పోలీస్ స్టేషన్ ముందు రాహుల్ గాంధీ ధర్నా..

కార్యాలయం బయట బాధితుడితో కలిసి ధర్నాకు కూర్చున్నారు. జులై 20న పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా వందలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు మార్చ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ సమయంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. 'ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్' (ఆర్ఏఎఫ్) సిబ్బంది పెల్లెట్ గన్స్ ఉపయోగించారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ ఘటనలో గాయపడినట్లు పలువురు నిరసనకారులు చెప్పడంతో పాటు వైద్య నివేదికలు కూడా ఉన్నాయని కాంగ్రెస్ పేర్కొంది. అయితే జులై 20న పెల్లెట్ గన్స్ ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు పలుసార్లు తెలిపారు. ఈ అంశంపై సీఆర్‌పీఎఫ్ మాత్రం ఇప్పటివరకు స్పందించలేదు. మరోవైపు, గాయపడిన నిరసనకారుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు పెల్లెట్ గన్స్ వాడలేదన్న వాదనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయని కాంగ్రెస్ పేర్కొంది.

# వైకాపా ఎంపీ అవినాష్ నివాసంలో రూ.24లక్షల నగదు సీజ్

సోదాలు జరిగాయి. పలు పత్రాలు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వైకాపా ఎంపీ అవినాష్ రెడ్డి నివాసాల్లోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. అవినాష్ నివాసంలో లెక్క చూపని రూ.24లక్షల నగదును సీజ్ చేశారు. ఆయనకు చెందిన రెండు లాకర్ల తాళాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో లభించిన డిజిటల్, ఆర్థిక ఆధారాలపై ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

## మొదటి పేజీ తరువాయి

# నేడు ఉత్తరాంధ్రలో చంద్రబాబు పర్యటన.. బిజీబిజీగా షెడ్యూల్

అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం అలమండ గ్రామానికి చేరుకుంటారు. అక్కడ 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఉదయం 11:05 గంటలకు ఏ.కొడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలో ఏర్పాటు చేసిన 'ప్రజా వేదిక'కు హాజరవుతారు. మధ్యాహ్నం 1:15 గంటల వరకు అక్కడే ఉండి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2:20 గంటలకు పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమవుతారు. అనకాపల్లి పర్యటన ముగించుకుని, ముఖ్యమంత్రి విజయనగరం జిల్లా ఎస్.కోటకు వెళ్తారు. అక్కడ సాయంత్రం 4:20 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కె.లలితకుమారి నివాసానికి వెళ్లి ఆమెను కలుస్తారు. అనంతరం విశాఖపట్నం బయలుదేరుతారు. విశాఖలోని నోవాటెల్ హోటల్‌లో సాయంత్రం 5:05 గంటలకు జరిగే రెండో బ్రిక్స్ యువజన, క్రీడల మంత్రుల సమావేశం--2026కు చంద్రబాబు హాజరవుతారు. విశాఖలో కార్యక్రమాలు ముగిసిన తర్వాత, ముఖ్యమంత్రి రాత్రికి తిరిగి అమరావతికి చేరుకుంటారు. ఈ పర్యటన ద్వారా ఒకేసారి ప్రభుత్వ కార్యక్రమాలు, పార్టీ వ్యవహారాలు, అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర ప్రతిష్ఠ వంటి అంశాలపై సీఎం దృష్టి సారించనున్నారు.

# పాక్ తక్షణ ముప్పు.. చైనా భవిష్యత్ సవాలు

కొనసాగుతుండటంతో ప్రస్తుతం పశ్చిమ సరిహద్దుపైనే భారత్ ఎక్కువ దృష్టి పెట్టాల్సి వస్తోందన్నారు. అందుకే పాకిస్థాన్ తక్షణ భద్రతా సవాలుగా ఉందని చెప్పారు. అయితే దీర్ఘకాలంలో చైనాతో పోటీ మరింత పెరుగుతుందని నరవణె అన్నారు. చైనాను తాను 'శత్రువు'గా కాకుండా 'పోటీదారు'గా చూస్తున్నట్లు చెప్పారు. పోటీ ఉన్నచోట విభేదాలు రావడం సహజమేనన్నారు. చైనాతో ఉన్న సమస్యలను చర్చలు, సంభాషణల ద్వారానే పరిష్కరించేందుకు ప్రయత్నించాలని సూచించారు. బలప్రయోగం చివరి మార్గంగా ఉండాలని చెప్పారు. అదే సమయంలో దేశ భద్రత కోసం బలమైన సైనిక శక్తి అవసరమని స్పష్టం చేశారు. ఎలాంటి దుస్సాహసాన్నైనా అడ్డుకునే స్థాయిలో సైన్యం సిద్ధంగా ఉండాలని అన్నారు. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, మయన్మార్ వంటి పొరుగు దేశాల్లో స్థిరత్వం ఉండేలా భారత్ సహకరించాలని నరవణె పేర్కొన్నారు. పొరుగు దేశంలో అశాంతి పెరిగితే శరణార్థులు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలు, అక్రమ ఆయుధాల సమస్యలు భారత్‌పైనా ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. శాంతే భారత్ ప్రధాన లక్ష్యమని, అయితే దేశ ప్రయోజనాల రక్షణకు పూర్తి సైనిక సన్నద్ధత ఉండాలని నరవణె అన్నారు. "శాంతి కావాలంటే యుద్ధానికి సిద్ధంగా ఉండాలి" అంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

# ఆయుర్వేద చికిత్స కోసం కేరళ వెళుతున్న పవన్ కల్యాణ్

అధినేత పవన్ కల్యాణ్ రేపు కేరళకు పయనం కానున్నారు. తన భుజం నొప్పికి ఆయుర్వేద చికిత్స తీసుకునే నిమిత్తం ఆయన శనివారం కేరళకు వెళ్లనున్నట్లు జనసేన పార్టీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల పవన్ కల్యాణ్ తన కుడి భుజం 'రొటేటర్ కఫ్' గాయానికి ముంబైలో శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కొంతకాలం పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని, అధికారిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వైద్యులు ఆయనకు సూచించారు. అయితే, పరిపాలనా బాధ్యతల దృష్ట్యా పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స జరిగిన వారంలోపే తిరిగి విధుల్లో చేరారు. ముందస్తుగా నిర్ణయించిన ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, శాఖాపరమైన సమీక్షలు, పార్టీ అంతర్గత సమావేశాలను ఆయన నిర్వహించారు. విశ్రాంతి లేకుండా విధుల్లో పాల్గొనడం వల్ల ఆయన భుజానికి వాపు రావడంతో పాటు తీవ్రమైన జ్వరం కూడా వచ్చినట్లు జనసేన పార్టీ పేర్కొంది. ఈ నేపథ్యంలో, భుజం నొప్పి నుంచి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి కేరళలో ప్రత్యేక ఆయుర్వేద చికిత్స తీసుకోవాలని వైద్యులు సూచించగా, ఆయన రేపు అక్కడకు వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# 22 మంది భారతీయులు ఉన్న రెండు నౌకలు హైజాక్

కేంద్రానికి ఆయుధాలు, కమ్యూనికేషన్, శాటిలైట్ పరికరాలను తరలిస్తుండగా.. సోమాలియా తీరంలో రెండు చిన్న పడవల నుంచి 8మంది సాయుధులు నౌకలోకి ప్రవేశించి హైజాక్ చేశారు. ఆగస్టు 20న మరో ఘటనలో.. యెమెన్ (వఎవఅ) తీరానికి సమీపంలో ఎరిట్రియా జెండాతో వెళ్తోన్న 'ఎం టి సిబు 1' అనే చమురు ఉత్పత్తుల ట్యాంకర్‌ను సముద్ర దొంగలు హైజాక్ చేశారు. ఇందులో ఉన్న 20మంది సిబ్బందిలో 16మంది భారతీయులు కాగా.. మిగిలిన వారు సిరియా, సూడాన్, ఇరాక్‌లకు చెందిన వారు. ప్రస్తుతం వారంతా పైరెట్స్ చెరలోనే ఉన్నారు. ఈ రెండు ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోందని.. సముద్రపు దొంగల నుంచి నావికులను సురక్షితంగా విడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు వెల్లడించారు. ఈ విషయంపై భారత విదేశీ వ్యవహారాల శాఖ ఇంకా స్పందించలేదు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సంపూర్ణ విజయం

## ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ధీమా



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21:**
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులంతా కలిసికట్టుగా పనిచేసి 100 శాతం స్ట్రైక్ రేట్‌తో విజయం సాధించడమే లక్ష్యమని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అన్నారు. సుజాతనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్గదర్శకాలకు అనుగుణంగా గెలుపు అవకాశాలున్న స్థానాలను గుర్తించి, కూటమిలో చర్చించి సీట్ల సర్దుబాటుపై నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. మేయర్, మున్సిపల్ ఛైర్మన్, జడ్పీ ఛైర్మన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని ప్రభుత్వం తీసుకురావడం వల్ల ప్రజాప్రతినిధులు నిర్భయంగా సేవలందించే వీలుంటుందని తెలిపారు. అలాగే ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాలు హుందాగా, ప్రజోపయోగంగా సాగాయని, ప్రతిపక్షం లేకున్నా కూటమి ఎమ్మెల్యేలే ప్రజల పక్షాన నిలిచి సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో నాయకులు గండి దుర్గాప్రసాద్, ముమ్మన సతీష్, పిన్నింటి పార్వతి, కోరుకొండ వరహాలు, తనకాల శ్రీనివాసరావు, అంబటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో విశాఖను సుందరంగా తీర్చిదిద్దాలి

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21:**
విశాఖ వేదికగా జరగనున్న అంతర్జాతీయ 'బ్రిక్స్ యూత్ మినిస్టర్స్ మీటింగ్--2026' నేపథ్యంలో విదేశీ ప్రతినిధులకు ఆహ్లాదకరమైన అనుభూతిని అందించేలా నగరాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, చీఫ్ ఇంజనీర్ పీవీవీ సత్యనారాయణ రాజు తదితర ఉన్నతాధికారులతో కలిసి ఆర్కే బీచ్ నుంచి నోవోటెల్ పరిసర ప్రాంతాల్లో పర్యటించి సుందరీకరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతినిధులు పాల్గొనే మార్గాల్లో రోడ్డు ప్యాచ్‌వర్క్‌లు వేగంగా పూర్తి చేయాలని, ఆధునిక స్ట్రీట్ లైటింగ్, వాల్ పెయింటింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. మద్దిలపాలెం నుంచి భీమిలి వరకు 14 ప్రధాన జంక్షన్లను సుందరీకరించడంతో పాటు సెంట్రల్ మీడియన్లలో పచ్చదనం పెంచాలని ఆదేశించారు. బీచ్ రోడ్, విశాఖ మ్యూజియం, తొట్లకొండ తదితర ప్రాంతాల్లో నిరంతర పారిశుధ్యం నిర్వహించాలని, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే ఆక్రమణలను తొలగించి, వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, సీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేష్ కుమార్, సీసీపీ ప్రభాకర్ రావు, డీసీపీ హరి దాసు తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ అలోసియస్ హైస్కూల్‌లో అలరించిన తెలుగు భాషా సంబరాలు



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21:**
సెయింట్ అలోసియస్ ఆంగ్లో ఇండియన్ హైస్కూల్‌లో తెలుగు వారోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన 'భువనవిజయం' నాటకం, వారి అద్భుత అభినయం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరై ప్రముఖ కవుల రచనలు, గేయాలు, ప్రాచీన వస్తువులు మరియు సంప్రదాయ వంటకాలతో ఏర్పాటు చేసిన తెలుగు భాషా సాహిత్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ?కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు రెవరెండ్ ఫాదర్ దేవుపల్లి జయప్రకాశ్ గారు విద్యార్థుల ప్రతిభను, తెలుగు ఉపాధ్యాయ బృందాన్ని ప్రశంసిస్తూ మాతృభాష గొప్పతనాన్ని తెలుసుకోవడంతో పాటు ఇతర భాషలను కూడా నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. తెలుగు విభాగం, ఉపాధ్యాయులు మరియు యాజమాన్యం సమష్టి కృషితో తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను చాటిచెప్పిన ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి.

# పర్మిషన్లు ఉన్నా స్కూల్ సీజ్ బిల్డింగ్ ఓనర్, ఎంఈఓ కుమ్మక్కయ్యారని ఆరోపణ

**భీమిలి సిటిజన్ టైమ్స్ ఆగష్టు 21:**
తనకు స్కూల్కి అన్ని అనుమతులు ఉన్నప్పటికీ భీమిలి ఎంఈఓ తన పాఠశాలను కక్షపూరితంగా సీజ్ చేశారని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ చైర్మన్ ఆకుల త్రిమూర్తులు ఆరోపించారు. మీడియాకు ఆయన శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం. విజయనగరం జిల్లా భోగాపురం మండలం మహారాజుపేట గ్రామంలో ఖణ×ాజు 28122601404 తో 2020 నుంచి తాను పూర్తి అనుమతులతో స్కూల్ నిర్వహిస్తున్నానని, బిల్డింగ్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం సమీపంలోని బిల్డింగ్‌కు మారామని తెలిపారు. ఆ బిల్డింగ్ రాజాపులోవ పంచాయతీ పరిధిలోకి వస్తుందని ఓనర్ గిడుతూరి సింహాచలం చెప్పారన్నారు. తర్వాత అదే ఓనర్ స్వలాభం కోసం బిల్డింగ్‌ను వేరొకరికి హాస్టల్ కోసం ఇవ్వాలని ఒత్తిడి చేయగా నిరాకరించామని, దీంతో జిల్లా కోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా ×ూ 378/2026 ఐఅ ూ 213/2026 ఇంజక్షన్ ఆర్డర్ వచ్చిందన్నారు.ఆ తర్వాత ఓనర్ ఫిర్యాదుతో విజయనగరం విద్యాశాఖ అనుమతులు రద్దు చేయగా, హైకోర్టును ఆశ్రయించగా





ఔూ.చీశీ.15531/2026 లో రద్దు ఉత్తర్వులపై స్టే ఇచ్చిందని తెలిపారు.అనంతరం ఓనర్ భీమిలి ఎంఈఓకు ఫిర్యాదు చేయగా, ఎంఈఓ శివరాణి పలుమార్లు స్కూల్‌కు వచ్చి ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. హైకోర్టు, జిల్లా కోర్టు ఆర్డర్లు చూపినా వినకుండా, కంటెంప్ట్ కేసు చీశీ.17022/2026 పెండిం గ్‌లో ఉండగా నే రాజకీయ నాయకులు పోలీసుల అండదండలతో నన్ను విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేసి స్కూల్‌ను సీజ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భీమిలి మండలంలో 2025లో అనుమతులు లేని మూడు ప్రైవేట్ స్కూళ్లు నడుస్తున్నా చర్యలు చేపట్టక పోగా , ఒకే పర్మిషన్‌తో కాలేజీలు, హాస్టళ్లు నడుపుతున్న వారిపై చర్య తీసుకోలేదని ఆయన ఆరోపించారు. మా స్కూలుకు ఎటువంటి ఇబ్బందులు లేవు పాఠశాల యదవిధి గా భోగాపురం మండలం పరిధిలో నిర్వహిస్తామని ఆయన తెలిపారు.కేవలం 27 అడుగుల రెవెన్యూ సరిహద్దు మారిందనే కారణంతో తన స్కూల్ ను మూసివేయడంకుట్రపూరితమని, ఆయన ఆరోపించారు ఇదే విషయంపై భీమిలి పోలీస్ స్టేషన్లో ఎంఈఓ శివరాం పై కేసు పెట్టడం జరిగిందన్నారు.

# భోగాపురం ఎయిర్‌పోర్టులో అదనపు దోపిడీ

## గూగుల్ సెంటర్‌పై కూటమి సర్కార్‌కు వైకాపా హెచ్చరిక



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21**
భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పేరుతో జీఎంఆర్ సంస్థ ప్రజల నుంచి అడ్డగోలుగా అదనపు వసూళ్లు చేస్తూ దోపిడీకి పాల్పడుతోందని విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆశీలమెట్టలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆరోపించారు. ఢిల్లీ, ముంబై విమానాశ్రయాల కంటే ఐదు రెట్లు అధికంగా ప్యాసింజర్, పార్కింగ్ ఛార్జీలు వసూలు చేస్తున్నారని, ఎయిర్‌పోర్టు కోసం స్థలాలిచ్చిన స్థానిక మత్స్యకారులకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. ఈ అన్యాయంపై స్థానిక కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీ భరత్ ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. అలాగే ఇతర రాష్ట్రాలు తిరస్కరించిన గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకువచ్చి ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నారని వాసుపల్లి విమర్శించారు. ఇప్పటికే తీవ్ర నీటి ఎద్దడి, కాలుష్య సమస్యలు ఎదుర్కొంటున్న విశాఖలో రోజుకు కోట్లాది లీటర్ల నీటిని గూగుల్ కోసం కేటాయించడం దారుణమన్నారు. డేటా సెంటర్ నుంచి సరైన ఆదాయ వనరులు సమకూరిస్తే విశాఖ మరింత అభివృద్ధి చెందుతుందని, స్వార్థ ప్రయోజనాల కోసం నగర భవిష్యత్తును తాకట్టు పెట్టొద్దని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో కూటమి వైఖరిపై ప్రజలు తిరగబడతారని, వైఎస్సార్సీపీ ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నగర, వార్డు స్థాయి నాయకులు పాల్గొన్నారు.

# సమాజ భాగస్వామ్యంతోనే వ్యవస్థల సంస్కరణ: ఆర్ఎస్ఎస్

**ఆనందపురం,సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21**
వ్యవస్థల్లోని లోపాలను సరిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలతో పాటు సమాజం కూడా చైతన్యవంతంగా వ్యవహరించాలని ఆర్ఎస్ఎస్ అఖిల భారత సహ సర్‌కార్యవాహ్ ముకుంద జీ పిలుపునిచ్చారు. కేవలం వ్యతిరేకతతో సమస్యలు పరిష్కారం కావని, సానుకూల దృక్పథంతో ప్రభుత్వం, సమాజం కలిసి పనిచేయాలని సూచించారు. ఆనందపురం మండలం గుడిలోవలోని విజ్ఞాన్ విహార్‌లో మూడు రోజులుగా నిర్వహించిన ఆర్ఎస్ఎస్ అఖిల భారతీయ సమన్వయ బైఠక్ శుక్రవారం ముగిసింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముకుంద జీ, అఖిల భారత ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ మాట్లాడారు. నీట్ వంటి అంశాలతో యువతలో నెలకొన్న ఆందోళనలను అర్థం చేసుకుని పరిష్కారాలు చూపాల్సిన బాధ్యత ఉందని నేతలు పేర్కొన్నారు. నిత్య శాఖలకు హాజరవుతున్న వారిలో 60 శాతానికి పైగా యువతే ఉన్నారని, వారి ఆలోచనలను అర్థం చేసుకుంటూ భారతీయ సంస్కృతి, విలువలను పరిచయం చేయాలని తెలిపారు. అలాగే పంచ పరివర్తనలో భాగంగా పర్యావరణ పరిరక్షణను జీవన విధానంగా మార్చుకోవాలని, నీటి ఆదా, ప్లాస్టిక్ నియంత్రణను





ప్రతి కుటుంబం పాటించాలని పిలుపునిచ్చారు. శతాబ్ది వేడుకల సందర్భంగా 'వసుధైవ కుటుంబకం' సందేశాన్ని ప్రపంచానికి అందించేందుకు సర్‌సంఘచాలక్ డా. మోహన్ భాగవత్ విదేశీ పర్యటనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్ఎస్ఎస్ ప్రముఖులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

## పెందుర్తి ప్రభుత్వ బాలుర వసతి గృహంలో సీఐ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



**పెందుర్తి, ఆగస్టు 21 (సిటిజన్ టైమ్స్)**
విద్యార్థులు మత్తు పదార్థాల వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ, సైబర్ నేరాల పట్ల పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని పెందుర్తి పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల మరియు బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఆయన, విద్యార్థులతో ముఖాముఖి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక అనర్థాలను వివరించడంతో పాటు ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా సురక్షిత వినియోగం, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, విద్యార్థి దశలో ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా దాచకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సీఐ స్పష్టం చేశారు. భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. విద్యార్థుల భద్రత, ఉజ్వల భవిష్యత్తు కోసం ఇలాంటి మార్గదర్శక కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు.

# నారా లోకేశ్‌కు తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ ఓపెన్ ఛాలెంజ్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21:**
విశాఖ నగర పర్యటనకు వస్తున్న మంత్రి నారా లోకేశ్ స్థానిక ప్రజా సమస్యలపై స్పందించి ప్రజల ముందుకు రావాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ డిమాండ్ చేశారు. విశాఖ ఎయిర్‌పోర్ట్ కార్మికుల నిరసనకు మద్దతు తెలపాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసిన అనంతరం రామ్ మీడియాతో మాట్లాడారు. ?విశాఖ విమానాశ్రయంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులు, చిరు వ్యాపారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలకు విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం ప్రజల కంటే కార్పొరేట్ శక్తులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. అభివృద్ధి పేరుతో నగరంలోని కొండలు, భూములు, సహజ వనరులను నాశనం చేయకుండా పేదలకు మేలు చేసే నిజమైన అభివృద్ధిని చేపట్టాలని సూచించారు. ఎన్నికల్లో బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్‌పై పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విశాఖ అభివృద్ధి ఎవరి ప్రయోజనాల కోసమో, ఎయిర్‌పోర్ట్ బాధితులకు ఎలాంటి న్యాయం చేస్తారో లోకేశ్ స్పష్టమైన సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పప్పూరు నికుంజ తదితరులు పాల్గొన్నారు.

# మదర్ థెరిస్సా విగ్రహావిష్కరణ



**ఆనందపురం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21**
ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 26న స్థానిక జోనల్ కార్యాలయ ఆవరణలో మదర్ థెరిసా విగ్రహావిష్కరణ మహోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ భీమిలి నియోజకవర్గ టీడీపీ యువ నాయకుడు గంటా రవితేజకు సంఘం ప్రతినిధులు ఆహ్వాన పత్రం అందజేశారు. మదర్ థెరిస్సా సేవా స్ఫూర్తిని సమాజంలో మరింతగా విస్తరింపజేయడమే లక్ష్యంగా ఈ విగ్రహావిష్కరణ చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, జోనల్ సలహాదారు కోన ప్రకాశ్, కోశాధికారి పచ్చిపులుసు కనకరావు, మండల అధ్యక్షుడు సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు, రేపు తొట్లకొండ వద్ద పర్యాటకులకు అనుమతి లేదు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21**
విశాఖ వేదికగా శనివారం, ఆదివారం బ్రిక్స్ దేశాల యువజన, క్రీడా మంత్రుల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో పర్యాటక ప్రాంతం అయిన తొట్లకొండ వద్ద పర్యాటకులకు అనుమతి ఉండదని, ఈ మేరకు అందరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతం తొట్లకొండ వద్ద శనివారం ఉదయం బ్రిక్స్ దేశాల ప్రతినిధులు మొక్కలు నాటే కార్యక్రమం, సందర్శన ఉంటుందని తెలిపారు. అలాగే 23వ తేదీ సాయంత్రం మరలా మంత్రులు, బ్రిక్స్ దేశాల ప్రతినిధులు సందర్శన ఉంటుందని, కావున ఈ రెండు రోజులూ సాధారణ సందర్శకులకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు సహకరించాలని ఓ ప్రకటన ద్వారా ఆయన విజ్ఞప్తి చేశారు.

# మధురవాడ చంద్రంపాలెం ఉన్నతపాఠశాలలో నూతన వసతుల ప్రారంభం



**విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 21**
రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శనివారం (ఆగస్టు 22) భీమిలి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఉదయం 10:00 గంటల నుండి 11:40 గంటల వరకు మధురవాడలోని చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో దివీస్ ల్యాబ్స్ సామాజిక బాధ్యత (జూ=) నిధులతో అభివృద్ధి చేసిన మౌలిక వసతులు, క్రీడా మైదానాన్ని ఆయన ప్రారంభించనున్నారు.

# అన్నవరం ఆర్టీసీ బస్టాండ్ ఆకస్మిక తనిఖీ

**రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి..**

**అన్నవరం బస్టాండ్‌లో ప్రయాణికులతో మాట్లాడి స్త్రీ శక్తి పథకంపై అభిప్రాయాలు తెలుసుకున్న మంత్రి**

**అన్నవరం బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలపై మంత్రి ఆరా**





**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 21**

అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను రాష్ట్ర రవాణా, యువజన,క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లోని మహిళా ప్రయాణికులతో మంత్రి మాట్లాడి, మహిళలకు అమలు చేస్తున్న స్త్రీ శక్తి, ఉచిత బస్సు ప్రయాణ పథకం సంవత్సర కాలం నుండి అమలుపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, వసతులపై ఆరా తీశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని అధికారులను సూచించారు. అనంతరం క్యాంటీన్ ను సందర్శించి, ఆర్టీసీ సిబ్బంది డ్రైవర్లు,కండక్టర్ కార్మికులతో కలిసి మంత్రి అల్పాహారం స్వీకరించి, వారితో ఆత్మీయంగా మాట్లాడారు.

## ఎలక్ట్రిక్ బస్సులో ఏఎస్ఆర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**ఏఎస్ఆర్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బస్‌స్టాండ్, చార్జింగ్ స్టేషన్‌ను పరిశీలించిన మంత్రి మండిపల్లి**

**ప్రతి అరగంటకు ఎలక్ట్రిక్ బస్సు.. మంత్రి మండిపల్లికి వివరించిన ఆర్ఎమ్**

**ప్రయాణికుల సౌకర్యాలపై ఏఎస్ఆర్ విమానాశ్రయంలో మంత్రి మండిపల్లి ఆరా**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21:**

విశాఖపట్నం నుంచి ఎలక్ట్రిక్ బస్సులో ఏఎస్ఆర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన బస్‌స్టాండ్, చార్జింగ్ స్టేషన్‌ను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి విశాఖపట్నం నుంచి విమానాశ్రయానికి కల్పించిన ఆర్టీసీ రవాణా సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్రతి అరగంటకు ఒక ఎలక్ట్రిక్ బస్సును నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు మంత్రికి వివరించారు.

## నరసింహాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు.....





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఆగస్టు 21:**

డా బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామములో వేంచేసియున్న నవనారసింహ క్షేత్రాలలో ప్రముఖమైన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం నందు శ్రావణ మాసం మొదటి శుక్రవారం శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి సాముహిక వరలక్ష్మి కుంకుమ పూజలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ కిరణ్, అర్చక స్వాముల ఆద్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించడమైనది. సుమారు 400 మంది ముత్తైదువులు పాల్గొని శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి వరలక్ష్మి కుంకమ పూజలు నిర్వహించారు. ఈ సాముహిక వరలక్ష్మి కుంకుమ పూజల యందు పాల్గొన్న ముత్తైదువులకు అమ్మవారి రూపు, పూజా సామాగ్రిని ఉచితంగా పంపిణి చేసినారు. శ్రీ స్వామి వారి దర్శనం, ప్రసాద వితరణ, నిత్యాన్నదాన విభాగము నందు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మోకా నాగవర ప్రసాదు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు రామ రంగాచార్యులు, పి శ్రీనివాసు, ఎంపీటీసీ నాగరాజు, సిబ్బంది, సేవకులు, తదితరులు పాల్గొన్నారు.

## బిజినపల్లిలో పగటి వేళ చోరీ

**నిందితుడు అరెస్ట్, సొత్తు రికవరీ**




**సిటిజన్ టైమ్స్ నాగర్ కర్నూల్ ఆగస్టు 21**

బిజినపల్లి మండలంలో పగటి వేళ ఇంటి దొంగతనం ఘటన చోటుచేసుకుంది. ముచ్చర్ల గ్రామానికి చెందిన సయ్యద్ రజియా బేగం (55) ఇంట్లో చోరీ జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కనక శివకుమార్ (23) అనే వ్యక్తిని నిందితుడిగా గుర్తించారు. బాధితురాలి ఇంటి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించినట్లు పోలీసులు తెలిపారు. గతంలో బాధితురాలి కుటుంబ సభ్యులతో పరిచయం ఉన్న నిందితుడు, తాళం వేసిన ఇంటిని గుర్తించి చోరీకి పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి బంగారు ఆభరణాలు, నగదును దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన ఆభరణాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి చోరీ సొత్తును రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై బిజినపల్లి పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేసి, తదుపరి చర్యల కోసం కోర్టు ముందు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

## కేసులకు భయపడం, ప్రజా సమస్యలపై పోరాటం ఆపం బి ఆర్ ఎస్ నేతలు

**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్ ఆగస్టు 21**

నాగర్‌కర్నూల్ నియోజకవర్గ ప్రజల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, పోలీసులు కేసులు నమోదు చేసినా భయపడేది లేదని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్, స్థానిక 2వార్డ్ కౌన్సిలర్ తిమ్మాజీపేట పాండు మాట్లాడుతూ.. గురువారం కల్యాణలక్ష్మి నిధుల విడుదలపై నిర్వహించిన కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి పోలీసులకు ఫోన్ చేసి కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అక్రమ భూదందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తూడుకుర్తిలో కాంట్రాక్టర్లతో ఇల్లు నిర్మించుకుంటున్నారని, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎకరం అగ్రిమెంట్ భూమిని సెటిల్‌మెంట్ ద్వారా తీసుకున్నారని, చెద్‌దాయపల్లి శివారులో 20 ఎకరాల భూమి కొనుగోలు చేశారని ఆరోపించారు. తెలకపల్లిలో ఓ వెంచర్ విషయంలో కోటి రూపాయలు తీసుకున్నారని, కొల్లాపూర్ చౌరస్తాలోని ఓ మిల్లుకు సంబంధించి రూ.45 లక్షలు తీసుకుని మిల్లు యజమాని జైలుకు వెళ్లకుండా సహకరించారని ఆరోపణలు చేశారు. ప్రభుత్వ భవనాల పేరుతో అనుమతులు తీసుకుని ఇసుక, మొరం విక్రయాలు చేస్తున్నారని, ఇందులో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల అనుచరులు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారని పాండు ఆరోపించారు. ఎం జె ఆర్ ట్రస్ట్ కేవలం రూ.5కే భోజనం అందిస్తున్న క్యాంటీన్‌కు నోటీసులు ఇవ్వడం సరికాదని విమర్శించారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు నిజాయితీపరులైతే ఉమామహేశ్వరం ఆలయానికి వచ్చి ప్రమాణం చేయాలని సవాల్




చేశారు. బీఆర్ఎస్ నాయకుడు విష్ణు మాట్లాడుతూ సంబంధం లేని వ్యక్తులపై కూడా 39 కేసులు నమోదు చేశారని, కేసులకు భయపడేది లేదన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల అండదండలతో ఇసుక తవ్వకాలు, రియల్ ఎస్టేట్ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తిమ్మాజీపేట మండల బి ఆర్ ఎస్ నాయకుడు ప్రదీప్ మాట్లాడుతూ తమకు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల చరిత్ర తెలుసని, అబద్ధాలు, కల్పిత ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిపై విమర్శలు చేసేవారు తమ స్థాయి తెలుసుకుని మాట్లాడాలని అన్నారు. ఈ సమావేశంలో బాల లక్ష్మయ్య, ఐతో లక్ష్మయ్య, మాజీ మార్కెట్ చైర్మన్ వెంకటయ్య, మాజీ కౌన్సిలర్ నరేందర్, నగేష్, రామకృష్ణారెడ్డి, షఫీ ఖాన్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ పునః నిర్మాణానికి భూరి విరాళాలు

**స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న దాతలు**

**వేగవంతంగా నిర్మాణ పనులు**



**పోలవరం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 21,మురమళ్ల**

నిత్య కళ్యాణం పచ్చతోరణం గా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరేశ్వర స్వామి వారి ఆలయ పునః నిర్మాణానికి

విరాళాలు అందించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. శుక్రవారం నిర్మాణానికి గోకులానందం ఆత్మ వీరేశ్వర మార్కండేయ శర్మ, వారణాసి రూ.1 లక్ష ,విరాళం ఆలయ చైర్మన్ కు అందజేశారు. ఈసందర్భం గా దాతను ప్రత్యేక దర్శనం అందించారు. ఆలయ మర్యాదలతో శేష వస్త్రం, చిత్ర పటం, ప్రసాదం అందించి సత్కరించి వేద ఆశీర్వచనం చేశారు. శ్రీ స్వామి వారి ఆలయ పునః నిర్మాణం స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు పర్యవేక్షణలో జరుగుతున్న విషయం తెలిసిందే.ఈ సందర్భంగా నిర్మాణానికి విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు వస్తున్నారు.గర్భాలయ, అంతరాలయ, నంది మండపం సంబంధించి నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.రూ లక్ష లేదా ఆపై విరాళం అందించే దాత పేరు శిలాఫలకం పై వేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆలయ చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు,అసిస్టెంట్ కమీషనర్, వి.సత్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో కతారి నాని, పర్యవేక్షణ అధికారి కతారి శ్రీనివాస రాజు తదితరులు ఉన్నారు.

## నారా లోకేష్ పర్యటన విజయవంతం చేయండి

**మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు**


**విజయనగరం, ఆగస్టు 21, (సిటిజన్ టైమ్స్ )**

రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి, యువ నాయకుడు నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంత్రి నారా లోకేష్ శనివారం మధ్యాహ్నం విజయనగరం చేరుకుని, విజయనగరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 3.30 గంటల వరకు నిర్వహించే హెచ్ఆర్డీ క్లస్టర్ సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి 6.30 గంటల వరకు విజయనగరం మండలం చెల్లూరు గ్రామంలో పార్టీ క్యాడర్‌తో సమావేశంలో పాల్గొంటారని ఈ కార్యక్రమాలను జిల్లా ప్రజలు



విజయవంతం చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న జనసేన



**అమరావతి: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 21**

స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సిద్ధమవుతోంది. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధివిధానాల రూప కల్పనకు పార్టీ అధ్యక్షుడు కొణిదలపవన్ కళ్యాణ్ 14 మందితో కమిటీ నియమించారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తల ఆలోచనలు కూడా ఈ కమిటీ పరిగణలోకి తీసుకుంటుందని జనసేన ప్రకటించింది. జనసైనికులు, వీర మహిళల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా ఎన్నికలకు సన్నద్ధమవుతామనిపవన్ పిలుపునిచ్చారు.


## ముమ్మిడివరం వీఆర్వో మృతి



**ముమ్మిడివరం. సిటిజన్ టైమ్స్ ఆగస్టు 21**

నగర పంచాయతీ పరిధిలోని గొల్లల వీధి సచివాలయం వీఆర్వో కే.ఎం.సత్యనారాయణ (56) శుక్రవారం మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యం తో బాధపడుతూ శుక్రవారం తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆయనను ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య దేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన స్వగ్రామం పిఠాపురం మండలం చేబ్రోలు. ఆయన భౌతికకాయాన్ని ముమ్మిడివరం తాసిల్దార్ తాడి సుభాష్, విఆర్వోలు, కార్యాలయ సిబ్బంది సందర్శించి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి కి సంతాపంగా ప్రభుత్వ లాంఛనాలతో గౌరవించి సాగనంపేందుకు తాసిల్దార్, రెవెన్యూ సిబ్బంది బయలుదేరి వెళ్లే లోపే మృతుని కుటుంబ సభ్యులు వెళ్లిపోయారు.

## అధ్వానంగా ప్రధాన రహదారి



**కొండ పర్వ: (సిటిజన్ టైమ్స్): ఆగస్టు: 21:**

ఎన్టీఆర్ జిల్లా, విస్సన్నపేట మండలం, కొండ పర్వలో ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దారిపై గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో వాహనాదారులు పాదచర్లు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం కాలు పెట్టి నడవలేని పరిస్థితి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. సమస్యపై పలుమార్లు అధికారులకు అర్జీలు ఇచ్చిన స్పందన లేదని తెలిపారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికలు కోరుతున్నారు.

## వరాలతల్లి వరలక్ష్మి దేవిగా శ్రీ రెడ్డెమ్మ తల్లి



**ఉమ్మడి చిత్తూరు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 21(సిటిజన్ టైమ్స్)**
అన్నమయ్య జిల్లా, గుర్రంకొండ మండలం, చెర్లోపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ రెడ్డెమ్మ దేవత దేవస్థానం నందు శ్రావణ మాసం రెండవ శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించడమైనది. ఉదయం శ్రీ అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా పరిమళభరిత పుష్పాలతో అలంకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతం నిర్వహించడమైనది. వరలక్ష్మీ వ్రత విశిష్టత గురించి భక్తులందరికీ తెలియజేసి వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించడం వలన సకల శుభాలు, అఖండ సౌభాగ్యాలు కలుగుతాయిని సర్వమంగళ సంప్రాప్తి కోసం సకలాభీష్టాల కోసం వరలక్ష్మీదేవిని పూజించాలని అర్చకులు తెలియజేశారు. స్త్రీలందరూ సామూహిక కుంకుమార్చన నిర్వహించి వరలక్ష్మి దేవిని పూజించారు. వ్రతంలో పాల్గొన్న స్త్రీలందరికీ అమ్మవారి ప్రసాదాన్ని అందజేసినట్లు ఆలయ చైర్మన్ లంకిపల్లి రాజన్న నాయుడు, ఈఓ మంజుల తెలియజేశారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 21**
హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ప్రజా దర్బార్ నిర్వహించారు. లి'ప్రజాదర్బార్'లి కార్యక్రమంలో పాల్గొని, ప్రజల నుంచి పలు సమస్యలపై 17 అర్జీలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా అర్జీదారుల సమస్యలను నేరుగా విని వినతులను స్వీకరించిన ఎమ్మెల్యే, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## మత్స్యకారుల ఆచూకీ కోసం గాలింపు నిరంతరం కొనసాగుతోందిలి

- 5 నౌకలు, 2 డోర్నియర్ విమానాలు, హెలికాప్టర్‌తో విస్తృత సెర్చ్ ఆపరేషన్
- మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్, బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంత అధికారులకు సమాచారం
- మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చే వరకు గాలింపు ఆగదు
- కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు




**అమరావతి:(సిటిజన్ టైమ్స్):ఆగస్టు 21:**
గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం భారత తీర రక్షక దళం చేపట్టిన గాలింపు చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోస్ట్‌గార్డ్ అసిస్టెంట్ కమాండింగ్ ఆఫీసర్ రంజిత్ కుమార్‌తో సంబంధిత అధికారులు మాట్లాడి సెర్చ్ ఆపరేషన్ పురోగతిని తెలుసుకున్నారని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం 5 నౌకలు, రెండు డోర్నియర్ విమానాలు, ఒక హెలికాప్టర్‌తో సముద్రంలో విస్తృతంగా గాలిస్తున్నట్లు కోస్ట్‌గార్డ్ అధికారులు తెలియజేశారన్నారు. మత్స్యకారుల బోటుకు సంబంధించిన సమాచారాన్ని మయన్మార్, పోర్ట్‌బ్లెయిర్‌తోపాటు బంగ్లాదేశ్ సరిహద్దు తీరప్రాంతాల్లోని కోస్ట్‌గార్డ్ అధికారులకు కూడా చేరవేశారని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోనూ బోటు ఆచూకీ కోసం అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం బోటు ఆచూకీ లభించనప్పటికీ, సెర్చ్ ఆపరేషన్‌లో ఎలాంటి విరామం ఉండదని మంత్రి స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ తరువాత బాధ్యతలు స్వీకరించే అధికారి కూడా గాలింపు చర్యలను కొనసాగిస్తారని కోస్ట్‌గార్డ్ అధికారులు తెలిపినట్లు వెల్లడించారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కోస్ట్‌గార్డ్, నేవీతో నిరంతరం సమన్వయం చేసుకుంటోందని చెప్పారు. కుటుంబ సభ్యులు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని, బోటు ఆచూకీ లభించే వరకు అన్ని మార్గాల్లో గాలింపు కొనసాగిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు.


# విశ్వ సమతుల్యతకు మూలాధారాలు

# సృష్టిని రక్షిస్తున్న దివ్య 'అష్ట నాగులు'

### సృష్టి స్థితి లయాల మూల రహస్యాల్లో నాగుల ప్రాముఖ్యత అనంతం

### భూమిని మోసే ఆదిశేషుడి నుంచి అమృత మథనానికి కారణమైన వాసుకి వరకు

### అష్టదిక్కులను, కుండలినీ శక్తిని, కాలచక్రాన్ని నిర్దేశించే అష్టమహా నాగాల అద్భుత వైభవం




**సిటిజన్ టైమ్స్ ప్రత్యేక కథనం :**
భారతీయ సనాతన ధర్మంలో నాగజాతికి అత్యున్నతమైన దైవిక స్థానం ఉంది. పురాణాల ప్రకారం కశ్యప ప్రజాపతి, కద్రువ దంపతులకు జన్మించిన నాగజాతి విశ్వ సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తోంది. భూమి భారాన్ని మోయడం, సముద్ర మథనం ద్వారా లోక కళ్యాణానికి అమృతాన్ని అందించడం, ప్రకృతి శక్తులను అదుపులో ఉంచడం వంటి అనేక బాధ్యతలను నాగులు నిర్వహిస్తున్నాయి. మన పురాణాలు విశ్వాన్ని రక్షిస్తూ, అష్టదిక్కుల సమతుల్యతను కాపాడే ఎనిమిది ప్రధాన నాగులను 'అష్ట నాగులు' లేదా 'అష్టమహా నాగులు'గా కొలుస్తున్నాయి. ఈ అష్ట నాగుల చరిత్ర, వాటి విశిష్టత మరియు పౌరాణిక ప్రాముఖ్యత అత్యంత లోతైనవి.

#### అనంతుడు (ఆదిశేషుడు):




సమస్త నాగ జాతికి ఆదిపురుషుడైన అనంతుడు వేయి పడగల దివ్య తేజస్సుతో విలసిల్లుతాడు. పరమాత్ముడైన శ్రీమహావిష్ణువుకు శేషతల్పంగా మారి క్షీరసాగరంలో శయన సేవను అందించే భాగ్యం ఆదిశేషుడికే దక్కింది. తన సహస్ర ఫణాలతో ఈ భూమండలాన్ని మోస్తూ విశ్వం స్థిరంగా ఉండేలా కాపాడుతున్న శక్తిస్వరూపం ఈయన. త్రేతాయుగంలో లక్ష్మణుడిగా, ద్వాపరయుగంలో బలరాముడిగా శ్రీహరితో పాటే అవతరించి ధర్మస్థాపనలో భాగస్వామి అయ్యాడు. అంతులేని కాలానికి, అనంతమైన విశ్వానికి ప్రతీకగా నిలిచే అనంతుడు ధైర్యానికి, నిష్కామ సేవకు నిలువెత్తు నిదర్శనం.

#### వాసుకి





దేవాసురులు క్షీరసాగర మథనం చేసినప్పుడు మందర పర్వతానికి తాడుగా మారి సకల లోకాలకు అమృతం అందడానికి మూలకారకుడైన త్యాగశీలి వాసుకి. హాలాహలం పుట్టినప్పుడు పరమశివుడి అనుగ్రహాన్ని పొంది ఆయన కంఠాభరణంగా నిలిచే శాశ్వతమైన దైవిక గౌరవాన్ని పొందాడు. నాగలోకానికి ప్రభువుగా పరిపాలన సాగించే వాసుకి దయాగుణానికి, సహనానికి మారుపేరుగా పురాణాలలో కీర్తించబడ్డాడు. అమృత ప్రాప్తి కోసం ఒంటినంతా రాపిడికి గురిచేసుకున్న వాసుకి త్యాగం సృష్టి చరిత్రలోనే అద్వితీయమైనదిగా నిలిచింది.

#### తక్షకుడు





నాగజాతిలో అత్యంత శక్తివంతుడు, మహా పరాక్రమవంతుడైన పాలకుడు తక్షకుడు. పాండవుల వంశస్థుడైన పరీక్షిత్తు మహారాజు మోక్ష ప్రాప్తికి కారణమైన ప్రధాన ఘట్టంలో తక్షకుడి ప్రస్తావన వస్తుంది. తక్షకుడిని సంహరించేందుకు జనమేజయుడు చేసిన 'సర్పయాగం' నాటి పురాణాలలో ఒక విప్లవాత్మక అధ్యాయంగా నిలిచింది. మాయాశక్తులు, అపారమైన మంత్ర బలం, ఖాండవ వన పరిరక్షణలో ఈయన చూపిన తేజస్సు తక్షకుడిని అత్యంత ప్రతిష్టాత్మకమైన, భయంకరమైన నాగరాజుగా నిలబెట్టాయి. ఈయన పాతాళ లోక రహస్య నిధులకు అధిపతిగా కూడా ఉంటాడు.

#### కర్కోటకుడు





పరమశివుడి సంపూర్ణ అనుగ్రహం కలిగిన కర్కోటకుడు విష ప్రభావంలో అత్యంత తీవ్రమైన వాడైనప్పటికీ, లోకోపకారిగా పురాణాల్లో పేరుపొందాడు. నళ మహారాజు శని ప్రభావం నుండి, కష్టాల నుండి విముక్తి పొందడానికి కర్కోటకుడే మార్గదర్శనం చేశాడు. యోగశాస్త్రంలో సాధకుని వెన్నెముకలో నిద్రాణమై ఉండే కుండలినీ శక్తిని మేల్కొల్పడంలో కర్కోటకుడి ప్రతీకను ఆధ్యాత్మికంగా భావిస్తారు. తీవ్రమైన శత్రు భయాలు, విష దోషాలు, కాలసర్ప దోషాలను పోగొట్టే దివ్య శక్తులు కర్కోటకుడి ఉపాసన ద్వారా లభిస్తాయని విశ్వసిస్తారు

#### పద్ముడు





దక్షిణ దిక్కుకు రక్షకుడిగా వ్యవహరించే పద్ముడు తెల్లటి కాంతితో, పద్మం వంటి ప్రశాంతమైన ముఖవర్చస్సుతో ప్రకాశిస్తుంటాడు. పద్ముడు ఆధ్యాత్మిక జ్ఞానానికి, సాధనలో మానసిక ప్రశాంతతకు సూచికగా ఉంటాడు. యోగులు తమ అంతఃచేతనను జాగృతం చేసుకునే క్రమంలో పద్మనాగుడి తత్వాన్ని ధ్యానిస్తారు. ఈ నాగరాజు ఉన్న ప్రదేశాలలో పాడిపంటలు సమృద్ధిగా ఉంటాయని, ప్రకృతి అనుకూలించి వర్షాలు కురుస్తాయని పౌరాణిక ప్రతీతి.

#### మహాపద్ముడు




ఈశాన్య దిశకు అధిపతిగా ఉంటూ సృష్టి సమతుల్యతను కాపాడే మరో మహోన్నతమైన నాగశక్తి మహాపద్ముడు. అసంఖ్యాకమైన పడగలతో, బంగారు ఛాయతో విరాజిల్లే మహాపద్ముడు సాగర గర్భంలోని, పాతాళంలోని అపారమైన ధనరాశులను, రత్న సంపదలను రక్షిస్తుంటాడు. లక్ష్మీదేవి కటాక్షానికి, అష్టైశ్వర్యాల ప్రదాతగా మహాపద్ముడిని పూజిస్తారు. ఈయన ఆశీస్సులు ఉంటే భౌతిక దారిద్ర్యం తొలగిపోయి అంతర్గత సంపద అయిన జ్ఞానం వృద్ధి చెందుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

#### శంఖుడు (శంఖపాలుడు)




నైరుతి దిశను పర్యవేక్షించే శంఖుడు లేదా శంఖపాలుడు శంఖం వంటి శ్వేత వర్ణంతో, దివ్యమైన నాదశక్తితో నిండి ఉంటాడు. శంఖుడి ద్వారా వెలువడే నాదం విశ్వంలో సానుకూల తరంగాలను వెదజల్లుతుందని, దుష్ట శక్తులను పారద్రోలుతుందని నమ్ముతారు. ప్రకృతిలోని పంచభూతాలను శాంతింపజేయడంలో శంఖుడి పాత్ర ప్రముఖమైనది. సంగీతం, నాదం, ఆధ్యాత్మిక విద్యలలో పరిపూర్ణతను సాధించాలనుకునే వారికి శంఖుడి అనుగ్రహం ఎంతగానో అవసరమని పురాణాలు వర్ణించాయి

#### గుళిక

కాల నియమాన్ని, విధి గతులను శాసించే అత్యంత రహస్యమైన నాగశక్తి గుళిక. జ్యోతిష్య శాస్త్రంలో గుళిక కాలం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. సమయ పాలనకు, కర్మ సిద్ధాంతానికి ప్రతీకగా నిలిచే గుళిక మనుషులు చేసే కర్మల ఫలితాలను సరిగ్గా అందించే కాలచక్ర నియంత్రకుడిగా ఉంటాడు. కాలభైరవుడి అంశతో సమానమైన శక్తిని కలిగిన గుళికను ఆరాధించడం వల్ల అకాల మృత్యు భయాలు తొలగి, జీవితంలో దురదృష్టాలు దరిచేరకుండా రక్షణ లభిస్తుందని నమ్ముతారు.



# ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి ఆర్థిక అక్షరాస్యత సదస్సు





**మలికిపురం సిటిజన్ టైమ్స్ ఆగస్ట్ 21**


నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ప్రతి ఒక్కరు ఆర్థిక అక్షరాస్యతపై ఖచ్చితంగా అవగాహన కలిగి ఉండాలని రాజోలు సబ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు పేర్కొన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ – ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మలికిపురం ఏఎఫ్‌డీటీ కళాశాలలో శుక్రవారం క్షేత్ర స్థాయి ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సురేష్ బాబు మాట్లాడుతూ –ప్రైవేట్ సంస్థల దగ్గర లోన్ తీసుకునేటప్పుడు లోన్ విధివిధానాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలి. డాక్యుమెంట్ లో ఉన్న వివరాలన్నీ చదివి, మీ స్తోమతకు తగ్గ లోన్ మాత్రమే తీసుకోవాలి. వీలైతే ప్రభుత్వ బ్యాంకుల నుండే లోన్ తీసుకోవడం ఉత్తమం.ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా లోన్లు తీసుకోకపోవడం నూరుశాతం మంచిది. తప్పనిసరి అయితే ఆర్బీఐ గుర్తింపు పొందిన బ్యాంకుల నుండి మాత్రమే తీసుకోవాలి అన్నారు.

అనంతరం ఆర్‌బీఐ ప్రతినిధులు మాట్లాడుతూ బ్యాంకులో డబ్బు డిపాజిట్ చేసినా, విత్ డ్రా చేసినా రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. ఏదైనా సమస్య వస్తే సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. లోన్ తీసుకునే ముందు వడ్డీ రేటు, ప్రాసెసింగ్ ఫీజు తదితర వివరాలను పూర్తిగా అడిగి తెలుసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్ లోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలకు బ్యాంకింగ్ హక్కులు, డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తత, బడ్జెట్ నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రొజెక్టర్ ద్వారా "ప్రతి రూపాయి" అనే అంశంపై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు.

**సమావేశంలో ప్రజల ఆవేదన:** రాజోలు నియోజకవర్గంలో కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు అధిక వడ్డీలు, ఇష్టానుసారంగా ప్రాసెసింగ్ ఫీజులు వసూలు చేస్తున్నాయని, వాయిదా ఆలస్యమైతే ఫోన్లు చేసి, ఇంటికి వచ్చి బలవంతంగా వసూళ్లు చేస్తూ మధ్యతరగతి ప్రజలను మానసికంగా వేధిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు పుట్టగొడుగుల్లా పెరగడానికి కొన్ని ప్రభుత్వ బ్యాంకులు కస్టమర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కారణమని, బ్యాంకుకు వెళితే రోజంతా పనులు కాక గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని, అందుకే ప్రజలు ప్రైవేట్ వైపు మొగ్గు చూపి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వాపోయారు. ఇకనైనా బ్యాంకింగ్ వ్యవస్థ సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అనుగుణంగా మారాలని, కస్టమర్ల పట్ల వ్యవహరించే తీరు మార్చుకోవాలని వారు కోరారు.

# ఉమ్మడి గోదావరి క్యాన్సర్ రోగులకు తీపి కబురు

## ఎంపీ సానా సతీష్ బాబు చొరవతో కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్స కేంద్రం



**కాకినాడ సిటిజన్ టైమ్స్ ఆగస్టు 21**

కాకినాడ జీజీహెచ్‌లో అధునాతన క్యాన్సర్ చికిత్స కేంద్రం ఏర్పాటుకు కీలక ముందడుగు పడింది. రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు ప్రత్యేక చొరవతో ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో ఈ కేంద్రం ఏర్పాటు కానుంది. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీని ఆగస్టు 3న కలిసి ఎంపీ సానా సతీష్ బాబు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆగస్టు 7న ఓఎన్‌జీసీ నుంచి ఒప్పంద పత్రం రాగా, ఆగస్టు 12న కాకినాడ జీజీహెచ్ అధికారులు సంతకాలు చేసి తిరిగి పంపించారు. ఓఎన్‌జీసీ కాకినాడ, గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స సదుపాయాల కోసం సుమారు రూ.48 కోట్ల సీఎస్ఆర్ నిధులు కేటాయించనుంది. ఇందులో కాకినాడ జీజీహెచ్‌కు సుమారు రూ.16 కోట్లు కేటాయించనున్నారు. కాకినాడలో హై ఎనర్జీ లీనియర్ యాక్సిలరేటర్, సీటీ సిమ్యులేటర్ వంటి ఆధునిక పరికరాలు అందుబాటులోకి రానున్నాయి.దీంతో ఉమ్మడి గోదావరి జిల్లాల క్యాన్సర్ రోగులు చికిత్స కోసం విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గే అవకాశాలు ఉన్నాయి.

# ఉయ్యూరులో డయేరియాపై అసత్య ప్రచారం..

**బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉంది: మంత్రి నారాయణ**

**కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని నారాయణ మండిపాటు**

**ప్రస్తుతం ఆసుపత్రిలో 9 మంది చికిత్స పొందుతున్నారని వెల్లడి**

**పరీక్షల నివేదిక ప్రకారం తాగునీటిలో బ్యాక్టీరియా లేదని వెల్లడైందన్న మంత్రి**



**ఉయ్యూరు, సిటిజన్ టైమ్స్, ఆగష్టు 21**

కృష్ణా జిల్లా ఉయ్యూరులో డయేరియా విస్తరిస్తోందంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని, కొందరు కావాలనే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మంత్రి నారాయణ మండిపడ్డారు. ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని డయేరియా బాధితులను ఆయన ఈరోజు పరామర్శించారు. స్థానిక 5వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆగస్టు 17న మృతి చెందిన ఒక వ్యక్తి గుండెపోటు కారణంగానే కన్నుమూశారని, ఆ మరణానికి డయేరియాకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి తేల్చిచెప్పారు. ప్రాథమిక నీటి పరీక్షల నివేదిక ప్రకారం తాగునీటిలో ఎలాంటి బ్యాక్టీరియా లేదని వెల్లడైందన్నారు. సమస్యకు కారణం మున్సిపల్ పైప్‌లైన్లా లేక ప్రైవేట్ ఆర్వో ప్లాంట్లా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని వివరించారు. అమృత్ 2.0 పథకంలో భాగంగా రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో పాత పైప్‌లైన్లను మారుస్తున్నామని, అందులో భాగంగా ఉయ్యూరులో రూ. 98 కోట్లతో పనులు చేపడుతున్నామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాబు రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో వరలక్ష్మీ వ్రతం

**సంతమాగులూరు, (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**

బల్లికురవ మండలంలోని కొత్తూరు గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానము హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం వద్ద వరలక్ష్మి వ్రత కార్యక్రమం కొనసాగింది . 110 మంది మహిళలు వ్రత పూజలో పాల్గొన్నారు. మహిళలకు పద్మావతి అమ్మవారి రూపులు, కంకణాలు, పుస్తక ప్రసాదం అందజేశారు . సమన్వయకర్త చెన్నుపల్లి నాగేశ్వరరావు ప్రత్యేక అధికారి రావినూతల రామకృష్ణ ,ధర్మాచార్యులు మాదాల దానయ్య, పెద్ది శెట్టి వెంకటాద్రి, స్థానిక దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

## అమలాపురంలో బ్రౌచర్ ఆవిష్కరించిన అముడా చైర్మన్ స్వామి నాయుడు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఆగస్టు 21**

ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవములు సెప్టెంబర్ 4 వ తేదీన అమలాపురం ఇస్కాన్ మందిరంలో నిర్వహిస్తునారు, శుక్రవారం అమలాపురం ఎమ్మెల్యే కార్యాలయంలో అముడా చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు చేతుల మీదుగా ఆహ్వాన పత్రికలు, బ్రౌచర్ ఆవిష్కరించారు,ఈ సందర్భంగా అమలాపురం ఇస్కాన్ మేనేజర్ శివానంద నిమాయి దాస్ ప్రభు మాట్లాడుతూ.. నేటి నుండి స్కూల్ విద్యార్థిని విద్యార్థులకు వ్యాసరచన,, భగవద్గీత శ్లోకాలు, శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు, అలాగే సెప్టెంబర్ 4 వ తేదీన శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవములు లో ఉదయం పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు, గౌర హారతి, ప్రవచనము, ఉట్టి ఉత్సవం, అన్నప్రసాద వితరణ, పోటీలలో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రముఖులచే బహుమతి ప్రధానం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు, ఈ వేడుకలకి అందరూ ఆహ్వానితులేనని, అందరూ పాల్గొనాలని తెలిపారు.



ఈ కార్యక్రమాలు ముక్తేశ్వరం రోడ్డు, కలెక్టర్ ఆఫీస్ వెనుక జనుపల్లి లో ఇస్కాన్ టెంపుల్ లో నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

# రోడ్డు ని కమ్మేస్తు అడవుని తలపిస్తున్న చెట్లు

## చీకటి పడితే చాలు ఆ రోడ్డులో వెళ్లాలంటే భయంతో వెళ్ళాల్సిందే




**ములగలంపాడు:(సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**

ఏలూరు జిల్లా లింగపాలెం మండలం ములగలంపాడు గ్రామం కాపుల బజారు లో వాహనాలు వెళ్ళడానికి వీలులేకుండా అడవిని తలపిస్తున్న పిచ్చి చెట్లు. చీకటి పడితే చాలు ఆ రోడ్లో వెళ్లాలంటే పిచ్చి చెట్లల్లో పాములు ఉంటాయో ఏ పురుగులు ఉంటాయో అని వాటి దాడికి గురైతే మా పరిస్థితి ఏంటని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లో ప్రతిరోజు 200 మంది ప్రయాణం కొనసాగిస్తూ ఉంటారు. ఈ మార్గంలో ప్రతిరోజు 50 వాహనాలు ఈ రోడ్డుపైనే వెళ్తూ ఉంటాయి.సిమెంట్ రోడ్డు పగుళ్లలో పిచ్చి మొక్కలు పెరగడం వల్ల రోడ్లు దెబ్బతినడం, వేర్లు విస్తరించి కాంక్రీటు పగిలిపోవడం, వర్షపు నీరు చేరి రోడ్డు త్వరగా పాడవడమే కాకుండా, రాకపోకలకు అంతరాయం కలిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మొక్కల వేర్లు సిమెంట్ పగుళ్లలోకి వెళ్లి బలమగా పెరగడం వలన రోడ్లు బీటలు వారి త్వరగా పాడైపోతాయని.మొక్కలు రోడ్డును కప్పడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రయాణికులకు ప్రమాదాలు జరుగుతాయి. పిచ్చి మొక్కల పొదల్లో దోమలు, తేళ్లు, పాములు వంటి విషపు పురుగులు చేరే ప్రమాదం ఉందని.రోడ్డు మీద మొక్కలు ఉండటం వలన వర్షపు నీరు సరిగ్గా పారక అక్కడక్కడా నిలిచిపోతుందని.కావున సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తక్షణమే ఆ పిచ్చి మొక్కలు తొలగించే ప్రయత్నం చేయాలని స్థానికులు కోరుకుంటున్నారు.

# వరలక్ష్మి వ్రతంలో ధనలక్ష్మిగా శ్రీ మావుళ్ళమ్మ!

**కాత్రేనికోన, సిటిజన్ టైమ్స్ ఆగష్టు 21**

శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా కాత్రేనికోనలోని ప్రముఖ గ్రామ దేవత, శక్తి స్వరూపిణి శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఆలయంలో నయనానందకరంగా పూజా కార్యక్రమాలు జరిగాయి.ఈ పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారిని 50, వేల రూపాయల కరెన్సీ నోట్లు, అపురూపమైన బంగారు ఆభరణాలతో భక్తుల దారిద్ర్యాన్ని పోగొట్టే "ధనలక్ష్మి దేవి" అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించారు. ఉదయం నుంచే ఆలయానికి భక్తులు పోటెత్తగా, సుమంగళీలు



పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, నోములు నిర్వహించి, తోరాలు కట్టుకున్నారు. కోరిన కోరికలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన అమ్మవారిని సాయంత్రం వేళ కూడా వేలాది మంది మహిళలు, భక్తులు దర్శించుకుని, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు కళ్ళు చెదిరే విద్యుత్ దీపాల అలంకరణలు, ప్రత్యేక పందిళ్ళు ఏర్పాటు చేయగా, భక్తులందరికీ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా ఈరోజు విశేష అన్నప్రసాద వితరణకు ప్రముఖ దాతలు ఆణివిళ్ళ బాలా శ్రీనివాస్, పడగ శ్రీనివాస్ ఉదారంగా వ్యవహరించారు.

# ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే సత్యానందరావు...



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఆగష్టు 21**

అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం గ్రామంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్ లో 13 వినతలు, ఫిర్యాదులు వచ్చినట్టు తెలిపారు.ఈ అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు పంపించి పరిష్కారం చేస్తామని చెప్పారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ముందుంటుందని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు.

# సొసైటీల్లో యూరియా పంపిణీ



**కాత్రేనికోన, సిటిజన్ టైమ్స్ ఆగష్టు 21**

పల్లంకుర్రు, కందికుప్ప ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సొసైటీల) పరిధిలోని రైతులకు నేటి నుండి యూరియా ఎరువును పంపిణీ చేయనున్నట్లు కాత్రేనికోన మండల వ్యవసాయ శాఖ అధికారి బి. మృదుల ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సాగు సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా ముందస్తుగానే అవసరమైన స్టాక్‌ను సిద్ధం చేశామని, యూరియా అవసరమైన రైతులందరూ ఆయా సంఘాల కార్యాలయాలకు వచ్చి వీటిని పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత కోసం రైతులు తమ వెంట తప్పనిసరిగా ఆధార్ కార్డ్, పట్టాదారు పాస్ పుస్తకం మరియు ఆధార్ నంబర్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌ను తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా విక్రయాలు జరుగుతాయని, రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే, ఈ ముఖ్యమైన సమాచారాన్ని గ్రామాలలోని తోటి రైతులకు కూడా చేరవేసి అందరికీ తెలిసేలా సహకరించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి బి. మృదుల విజ్ఞప్తి చేశారు.

# టిడిపి నాయకులు వయ్యకంటి హుక్కు ఆధ్వర్యంలో రెండేళ్ల నమ్మకం

## రహదారుల అభివృద్ధి ప్రజాసేవే లక్ష్యంగా -సొంత నిధులతో మూడు మట్టితో నిర్మించిన రహదారులు

## కూటమి ప్రభుత్వ లక్ష్యాన్ని మంత్రి గొట్టిపాటి అడుగుజాడల్లో నడుస్తూ..

**సంతమాగులూరు, (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**

సంతమాగులూరు మండలం కొమ్మాలపాడు గ్రామంలో శుక్రవారం రెండేళ్ల నమ్మకం కార్యక్రమం వయ్యకంటి ఉక్కు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేషమైన స్పందన రావడం ఆనందకరంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వయ్యకంటి హుక్కు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సూపర్ సిక్స్ లో భాగంగా ప్రజాధనాన్ని వృధా కాకుండా ప్రజల వద్దకు సంక్షేమం చేర్చడమే తన కర్తవ్యంగా చేస్తామని చెప్పారు. మంత్రివర్యులు గొట్టిపాటి రవికుమార్ అడుగుజాడల్లో ప్రజాసేవే తనకు ముఖ్య లక్ష్యంమని ప్రజా సమస్యలను పరిశీలించడమే తన ఉద్దేశమని, కొమ్మాలపాడు గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు తన సాయశక్తుల కృషి చేస్తానని, ఏటువంటి రాజకీయ అపోహలకు తావివ్వని ఆయన తెలిపారు. ప్రజలతో మమేకమై అందరి సమస్యలను తెలుసుకుంటూ వారి సమస్యలు అధికారులు దృష్టికి తీసుకు వెళ్లే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. అంతేకాకుండా కుల మత భేదలకు తావు ఇవ్వకుండా అందరికీ సమాన హక్కులు ఉండాలని ఆయన తెలిపారు. కొద్ది రోజుల క్రితం హిందువుల స్మశాన వాటికకు వెళ్లే డొంక రహదారికి వర్షం పడితే వెళ్ళలేని పరిస్థితి ఉన్నందున ఆయన సొంత నిధులు 50000/- రూపాయలతో ఆ రహదారి సమస్యను పరిష్కారం చేయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఇవే కాకుండా మాగులూరు డొంక రహదారి సుమారు 350000/- రూపాయల వ్యయంతో తన సొంత నిధులతో వేయించడం జరిగిందని. తన సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు



చేయడం తాను ఒక బాధ్యతగా తీసుకున్నానని ఆయన తెలిపారు.

**వయ్యకంటి ఉక్కు గురించి ప్రజలలో విశేష స్పందన**

కొమ్మలపాడులో చేస్తున్న పలు అభివృద్ధి పనులు గ్రామ కార్యక్రమాలలో వయ్యకంటి హుక్కు ఎంతో కృషి చేస్తున్నారని, ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతున్నారని ఆయన చేస్తున్న సేవలు స్థానిక ప్రజానీకానికి ఎంతో శ్రేయస్కరంగా ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయ్యకంటి మస్తాన్ వలి హుక్కు, మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు వయ్యకంటి దరియవలి, నాయబ్ ఫజల్, కాలేషాగారి బాజీ, షేక్ మహబూబ్ బాషా, వయ్యకంటి భాష,



నాయకులు, కార్యకర్తలు, పలువురు పాల్గొన్నారు.

# వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం





**కందుకూరు (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**

వరలక్ష్మి వ్రతం సందర్భంగా కందుకూరు పెద్ద బజారు నందు ఉన్న శ్రీ కోదండ రామాలయంలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీ లక్ష్మీ అమ్మవారికి అభిషేకం నిర్వహించి, చందన అలంకారంతో అమ్మవారిని కన్నులు పండుగగా అలంకరించారు. అమ్మవారి అలంకారం భక్తులకు కనువిందు చేసింది. మద్దాళి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వరలక్ష్మీ వ్రతం కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# గిద్దలూరు మున్సిపాలిటీలో 28 వార్డుల విభజన

## మున్సిపల్ కమిషనర్ బి వి రమణ బాబు

**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**



గిద్దలూరు మున్సిపాలిటీ ని వార్డుల పునర్విభజన లో భాగంగా 28 వార్డులుగా విభజిస్తూ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం లభించిందని మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు తెలిపారు. పురపాలక పరిపాలన ,పట్టణ అభి వృద్ధి శాఖ జారీ చేసిన ఉత్తర్వులు మేరకు గిద్దలూరు పురపాలక సంఘంలో ఎన్నికల వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. ఆ మేరకు గిద్దలూరు పురపాలక సంఘాన్ని 28 వార్డులు గా విభజిస్తూ రూపొందించిన ముసాయిదా నోటిఫికేషన్ ను నోటీస్ బోర్డు పురపాలక పరిధి లో ని ప్రముఖ ప్రదేశాల లో ప్రదర్శించి ప్రజల నుండి అభ్యంతరాలు సలహాలు సూచనలు స్వీకరించామన్నారు. ఆ అభ్యంతరాల ను ,సలహాలు పరిశీలించి గిద్దలూరు పురపాలక సంఘం ప్రత్యేక అధికారి కి పంపగా ఈ ఏడాది మే 25 న జరిగిన సమావేశంలో ప్రత్యేక అధికారి ఈ ప్రతిపాదన కు ఆమోదం తెలిపి మార్కాపురం జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వ ఆమోదానికి సమర్పించాలని తీర్మానించటం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆ ప్రతిపాదన ను ఆమోదిస్తూ గిద్దలూరు పురపాలక సంఘాన్ని 28 వార్డు లు గా విభజిస్తూ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

# ఘనంగా వరలక్ష్మి వ్రత పూజలు - మహిళల భక్తి శ్రద్ధలు

**పీసీపల్లి, (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21**

మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో శుక్రవారం వరలక్ష్మి వ్రత వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో, వైభవంగా జరిగాయి. మండలంలోని ఇర్లపాడు , పెద్ద చెర్లోపల్లి వెంగళాపురం, అలవలపాడు తదితర గ్రామాల్లో మహిళలు ఇళ్లలో అమ్మవారిని కొలుస్తూ పూజలు నిర్వహించారు. శ్రావణ మాసంలో రెండవ శుక్రవారం సందర్భంగా మహిళలు తెల్లవారుజామునే లేచి ఇళ్లను శుభ్రం చేసుకుని, ముగ్గులు వేసి, మామిడి తోరణాలతో అలంకరించారు. వరలక్ష్మి దేవి ప్రతిమను ఏర్పాటు చేసి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, నైవేద్యాలతో ఘనంగా పూజించారు. తమ భర్తలు, పిల్లలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని మహిళలు అమ్మవారిని వేడుకున్నారు. పలువురు మహిళలు సమూహంగా ఒకచోట చేరి వరలక్ష్మి వ్రత కథను చదివి వినిపించారు. అనంతరం ఒకరికొకరు వాయినాలు, తాంబూలాలు ఇచ్చిపుచ్చుకుని శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లోని లక్ష్మీ ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. వ్రతం సందర్భంగా గ్రామాలన్నీ పండగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి.

# ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను, వైఫల్యాలను తీవ్రంగా ఖండిస్తున్నాం -వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ దద్దాల

**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**




రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని,ప్రజల దృష్టిని మళ్లించడానికి, నిత్యం ప్రతిపక్షంపై కక్షసాధింపు చర్యలకే పరిమితమైందని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ ధ్వజమెత్తారు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం నుండి ఒక ప్రకటన లో దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు వారి తనయుడు విద్యా శాఖ మంత్రి లోకేష్ కు విసిరిన సవాల్ స్వీకరించి వాటిపై సమాధానం చెప్పగలరా అని ఆయన అన్నారు. వైఎస్ జగన్ లేవనెత్తిన ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పలేక, అసెంబ్లీలో ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా విపక్షం గొంతు నొక్కాలని చూస్తోందన్నారు.

**డీఎస్సీ, గ్రూప్-1 నియామకాలపై డ్రామాలు**

డీఎస్సీ ప్రక్రియలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి, తన కుటుంబ సభ్యులను కాపాడుకోవడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, ఏపీపీఎస్సీ గ్రూప్-1 పోస్టుల భర్తీపై తప్పుడు ఆరోపణలు చేస్తూ అసలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. గ్రూప్-1 నియామకాలపై సీబీఐ విచారణకు మేం పూర్తిగా సిద్ధం... మరి మీ డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు ప్రభుత్వం సిద్ధమా? అని ప్రశ్నించారు.

**ఉపాధ్యాయుల వేధింపులు దారుణం**

ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ నిర్వహించాలన్న అనాలోచిత నిర్ణయాన్ని ప్రశ్నిస్తూ, న్యాయమైన సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించిన ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం అత్యంత దుర్మార్గమని, ఉపాధ్యాయుల పొట్ట కొట్టే ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే వారి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నామని లేదంటే ఉపాధ్యాయ లోకానికి అండగా వైఎస్సార్‌సీపీ తీవ్రస్థాయిలో పోరాటం చేస్తుందని హెచ్చరించారు.

**ప్రతిపక్ష హోదాపై భయం**

ప్రజాస్వామ్యంలో ప్రజల తరఫున గట్టిగా నిలదీస్తున్న ఏకైక ప్రధాన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీనే,శాసనసభలో మా గొంతును చూసి భయపడే ప్రభుత్వాలు మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజలు ఈ ప్రజా వ్యతిరేక విధానాలను గమనిస్తున్నారని కాలం చెల్లిన రాజకీయాలతో మభ్యపెట్టాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర నిరసనలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని వెల్లడించారు.

# మాజీ సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసిన పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని గిద్దలూరు వైసిపి నాయకులు ఏపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ ఎర్రగొండపాలెం పరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డి ని కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడిన మాజీ సీఎం జగన్ .. స్థానిక ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో సంసిద్ధంగా ఉండి వాటిని బలోపేతం చేస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు. అలానే ఎర్రగొండపాలెం లో ప్రవీణ్ కుమార్ రెడ్డి నిర్వహిస్తున్న బాధ్యతలను ప్రశంసించారు. అక్కడ ఎటువంటి సమస్యలు లేకుండా పార్టీని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ కార్యకర్తల సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు.

# పువ్వాడి వెంకటేశ్వర్లును పరామర్శించిన.. మాజీ ఎమ్మెల్యే కదిరి

**సి ఎస్ పురం, (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**

పామూరు మండలం టిడిపి మాజీ మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఇటీవల గుండె సంభంధిత శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కనిగిరి మాజీ ఎమ్మెల్యే ,విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు పామూరు లోని వెంకటేశ్వర్లు నివాసగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగితెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ద వహించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.



# నేడు కొమరోలు పట్టణంలోని 14 వీధులకు విద్యుత్ సరఫరా నిలిపివేత

## తాతిరెడ్డి పల్లి ఫీడర్ లోని నాలుగు గ్రామాలకు కూడా సరఫరా నిలిపివేత

**కొమరోలు (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**



కొమరోలు పట్టణంలోని 14 వీధులతోపాటు తాతిరెడ్డిపల్లె ఫీడర్ లోని నాలుగు గ్రామాలకు ఈనెల 22వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా కొత్త లైన్ల ఏర్పాట్ల లోభాగంగా ఈనెల 22వ తేదీ శనివారం కొమరోలు పట్టణంలోని పలు వీధులలో కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ కారణంగా కొమరోలు పట్టణంలోని పురుషోత్తముని పల్లికి వెళ్లే రోడ్డు, ఇండేన్ గ్యాస్ కార్యాలయం మెయిన్ రోడ్డు, ఆరె మరాఠీ కాలనీ, శివాజీ నగర్, ఇస్లాంపేట, స్టేట్ బ్యాంకు రోడ్డు,బ్రాహ్మణ బజారు,సినిమా హాల్ కి వెళ్లే రోడ్ల వీధులు,తాసిల్దార్ కార్యాలయం రోడ్డు లోని వీధులతో పాటు, తాతిరెడ్డిపల్లి ఫీడర్ లోని తాతిరెడ్డి పల్లె, పురుషోత్తమపల్లె, సరివి రెడ్డి పల్లె, కే బొంతపల్లి గ్రామాలకు ఈనెల 22 తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా ఆయన చెప్పారు. కాగా కొమరోలు పట్టణంలోని బొరుగుల బట్టి కి వెళ్లే రోడ్డు, పోలీస్ స్టేషన్ రోడ్డు,ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, షిరిడి సాయిబాబా గుడి ఏరియా, తో పాటు గోపాని పల్లి గ్రామానికి ఈనెల 22వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన వివరించారు కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని శ్రీనివాసులు కోరారు.

# సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం

## సనాతనధర్మ పరిరక్షణకు కృషి చేయాలి -ఎం. అచ్యుతరావు

**సి.ఎస్.పురం, (సిటిజన్ టైమ్స్): ఆగష్టు 21:**

సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్రహారం గ్రామంలోని రామాలయం వద్ద శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా సమరసత సేవా ఫౌండేషన్ మండల మహిళా కన్వీనర్ కె. పద్మావతి పాల్గొని మాట్లాడుతూ శ్రావణమాసం ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టమైన మాసమని, ఈ మాసంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతానికి మహిళల జీవితాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. కుటుంబ సుఖసంతోషాలు, ఆరోగ్యం, ఐశ్వర్యం కోసం మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ఆరాధించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

**సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి..:** ఈ సందర్భంగా ఖండ




ధర్మ ప్రసారక్ ఎం. అచ్యుతరావు మాట్లాడుతూ వరలక్ష్మీ వ్రతం కేవలం ఒక పూజా కార్యక్రమం మాత్రమే కాదని, కుటుంబ వ్యవస్థను, ధార్మిక సంప్రదాయాలను బలోపేతం చేసే ఆధ్యాత్మిక కార్యక్రమమని అన్నారు. శ్రావణమాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించడం ద్వారా లక్ష్మీదేవి అనుగ్రహం లభిస్తుందని భక్తుల విశ్వాసమన్నారు. మన పూర్వీకులు ఆచరించిన పూజా విధానాలు, వ్రతాలు, హోమాలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, వాటి వెనుక ఉన్న ఆధ్యాత్మిక భావనలను నేటి తరానికి తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు హోమాలు నిర్వహించడం ద్వారా వాతావరణంలో పవిత్రత నెలకొనడంతోపాటు భక్తుల్లో ఏకాగ్రత ఆధ్యాత్మిక భావన పెంపొందుతుందన్నారు గ్రామాల్లోని ఆలయాలలో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల మధ్య ఐక్యత సోదరా భావం పెరుగుతుందన్నారు మహిళలు యువత, భక్తులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని సనాతన ధర్మ సంప్రదాయాలను పరిరక్షించాలని పిలుపునిచ్చారు భావితరాలకు మన సంస్కృతి గొప్పతనాన్ని తెలియజేశాలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో మండల సహా కన్వీనర్ కె కొండయ్య, గ్రామ ధార్మిక సమితి సభ్యులు, గ్రామస్తులు, మహిళలు భక్తులు పాల్గొన్నారు.

# 2026లో రౌడీ దర్శనం లేనట్లేనా?







విజయ్ దేవరకొండ కమ్ బ్యాక్ మూవీ కోసం తన అభిమానులు చాలా ఏళ్లుగా ఎదురు చూస్తున్నారు. గీత గోవిందం విజయ్ చివరి క్లీన్ హిట్. ఆ తర్వాత తన సినిమాలన్నీ నిరాశపరిచాయి. గత ఏడాది వచ్చిన 'కింగ్డమ్'తో బలంగా పుంజుకుంటాడనే అంచనాలు కలిగాయి కానీ.. అది నిజం కాలేదు. ఆ సినిమా ఓ మాదిరిగా ఆడి వెళ్లిపోయింది.ఐతే విజయ్‌కి ఉన్న అదృష్టం ఏంటంటే.. ఎన్ని ఫ్లాపులు ఇచ్చినా తన ఫాలోయింగ్, మార్కెట్ అలాగే కొనసాగుతున్నాయి. క్రేజీ ప్రాజెక్టులు తన చెంతకు వస్తున్నాయి. గత ఏడాది అతను ఒకేసారి రెండు భారీ చిత్రాలను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. అందులో ఒకటి రణబాలి కాగా.. ఇంకోటి రౌడీ జనార్ధన. వీటిలో మొదటిది సెప్టెంబరులో, రెండోది డిసెంబర్లో రిలీజ్ కావాల్సింది. రెంటికీ రిలీజ్ డేట్లు కూడా ఇచ్చారు. కానీ ఈ రెండూ అనుకున్నట్లుగా విడుదల కావట్లేదు.'రణబాలి' వాయిదా అని ఇంతకుముందే క్లారిటీ వచ్చేసింది. ఇప్పుడు 'రౌడీ జనార్ధన' సైతం డిసెంబరులో రిలీజ్ కాదని తెలుస్తోంది. 'రణబాలి' ముందే ఆలస్యం కాగా.. హీరోయిన్ రష్మిక మందన్నా గాయంతో మరింత లేట్ అవుతోంది. ఈ సినిమా షూట్ ఇంకా 30 శాతం దాకా మిగిలి ఉన్నట్లు సమాచారం. మరోవైపు 'రౌడీ జనార్ధన' వర్క్ 50 శాతం దాకా బ్యాలెన్స్ ఉందట. ఈ రెంటిలో ఏదీ ఈ ఏడాదిలో పూర్తయి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు లేదు. కాబట్టి రౌడీ దర్శనం కోసం 2027 వరకు ఎదురు చూడాల్సిందే. ఐతే వచ్చే ఏడాది ఈ రెంటితో పాటు మరో చిత్రంతోనూ విజయ్ ప్రేక్షకులను పలకరించే అవకాశముంది. రణబాలి, రౌడీ జనార్ధన వచ్చే ఏడాది ప్రథమార్ధంలోనే రిలీజ్ అవుతాయి. 'హాయ్ నాన్న' ఫేమ్ శౌర్యువ్‌తో అనౌన్స్ చేసిన సినిమాను సెకండాఫ్‌లో ప్రేక్షకుల ముందుకు తెచ్చే అవకాశముంది. కాబట్టి ఈ ఏడాది సినిమా లేకపోయినా.. వచ్చే ఏడాది విజయ్ అభిమానులను మూడు చిత్రాలతో మురిపించే ఛాన్సుంది.

## భారత్‌తో రెండో టెస్టుకు శ్రీలంక జట్టులో భారీ మార్పులు.. ఐదుగురిపై వేటు!

- గాయం కారణంగా చండిమాల్ దూరం.. మరో నలుగురు ఆటగాళ్లపై వేటు
- ఆల్ రౌండర్ సహన్ అరాచ్చిగే, బ్యాటర్ కమిల్ మిషారాలకు జట్టులో చోటు
- భారత్-ఏ, లంక ప్రీమియర్ లీగ్‌లో రాణించడంతో యువ ఆటగాళ్లకు అవకాశం



భారత్‌తో జరిగిన తొలి టెస్టులో ఘోర పరాజయం చవిచూసిన శ్రీలంక, రెండో టెస్టు కోసం తమ జట్టులో భారీ మార్పులు చేసింది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని భారత జట్టుతో ఆదివారం కొలంబోలో ప్రారంభంకానున్న చివరి టెస్టు కోసం 14 మంది సభ్యులతో కూడిన జట్టును శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) ప్రకటించింది. ఈ జట్టు నుంచి ఐదుగురు ఆటగాళ్లను తప్పించి, దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న ఇద్దరు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. ఆల్ రౌండర్ సహన్ అరాచ్చిగే, బ్యాటర్ కమిల్ మిషారాలు తొలిసారిగా టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నారు. గాలేలో జరిగిన తొలి టెస్టులో గాయపడిన సీనియర్ ఆటగాడు దినేశ్ చండిమాల్ రెండో టెస్టుకు దూరమయ్యాడు. అతని స్థానంలో కాంకషన్ సబ్‌స్టిట్యూట్‌గా అరంగేట్రం చేసిన పసిందు సూరియబండార, తాను ఆడిన ఏకైక ఇన్నింగ్స్‌లో గోల్డెన్ డక్‌గా వెనుదిరగడంతో అతనిపైనా సెలక్టర్లు వేటు వేశారు. వీరితో పాటు ఓపెనర్ నిషాన్ మదుష్క, బౌలింగ్ ఆల్ రౌండర్ రమేశ్ మెండిస్, ఫాస్ట్ బౌలర్ దిల్షాన్ మదుష్కలను కూడా జట్టు నుంచి తప్పించారు. ఇటీవల భారత్-ఏ జట్టుతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో శ్రీలంక-ఏ జట్టుకు నాయకత్వం వహించి అద్భుత ప్రదర్శన చేసిన సహన్ అరాచ్చిగేకు సెలక్టర్ల నుంచి పిలుపు అందింది. ఆ సిరీస్‌లో అతను రెండో మ్యాచ్‌లో 127 పరుగులు, తొలి మ్యాచ్‌లో 72 పరుగులు సాధించాడు. మొత్తం రెండు మ్యాచ్‌లలో 209 పరుగులతో తన జట్టు తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఝుమరోవైపు, బ్యాటర్ కమిల్ మిషారా కూడా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇటీవల ముగిసిన లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్) 2026 సీజన్‌లో 9 ఇన్నింగ్స్‌లలో 411 పరుగులు చేసి సత్తా చాటాడు. ఇందులో గాలే గ్యాలంట్స్‌పై సాధించిన సెంచరీ కూడా ఉంది. అంతేగాక మేజర్ క్లబ్స్ టీ20 టోర్నీలో గురువారం కేవలం 72 బంతుల్లో 145 పరుగులు బాది తన విధ్వంసకర ఫామ్‌ను చాటుకున్నాడు.

**భారత్, శ్రీలంక మధ్య జరిగిన తొలి టెస్టులో టీమిండియా**


165 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో భారత బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (167) సెంచరీతో కదం తొక్కగా, ఎడమచేతి వాటం స్పిన్నర్ మానవ్ సుతార్ రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 10 వికెట్లు పడగొట్టి లంక పతనాన్ని శాసించాడు. ఈ నేపథ్యంలో సిరీస్‌ను సమం చేయాలనే లక్ష్యంతో శ్రీలంక పటిష్ఠమైన జట్టుతో బరిలోకి దిగుతోంది. ఇరు జట్ల మధ్య రెండో టెస్టు ఆగస్టు 23న ప్రారంభం కానుంది.

**రెండో టెస్టుకు 14 మంది సభ్యులతో శ్రీలంక జట్టు ఇదే..**

లహిరు ఉడార, కమిల్ మిషారా, పసిందు సూరియబండార, కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), ధనంజయ డి సిల్వా (కెప్టెన్), సహన్ అరాచ్చిగే, సోనాల్ దినుష, నిరోషన్ డిక్వెల్లా, కేశార నువంత, ప్రభాత్ జయసూర్య, మిలన్ రత్నాయకే, లహిరు కుమార, అశిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో.

## భారత మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్‌కు భారీ ఊరట.. 22 ఏళ్ల తర్వాత క్లీన్ చిట్

- 22 ఏళ్ల నాటి క్రిమినల్ కేసులో మాజీ క్రికెటర్ జాకబ్ మార్టిన్‌కు విముక్తి
- ఢిల్లీ పాటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా ప్రకటిస్తూ కీలక తీర్పు
- కేసు కారణంగా రైల్వే ఉద్యోగం కోల్పోయి తీవ్ర ఒత్తిడికి గురయ్యానన్న మార్టిన్
- అంతర్జాతీయ క్రికెటర్ కావడం వల్లే తనను ఇరికించారని ఆరోపణ
- ఈ తీర్పు తన జీవితంలో ఒక పెద్ద మలుపు అని వ్యాఖ్య



భారత మాజీ క్రికెటర్, వడోదర నివాసి జాకబ్ మార్టిన్‌కు 22 ఏళ్ల సుదీర్ఘ న్యాయపోరాటంలో భారీ ఊరట లభించింది. ఆయనపై నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ఆధారాలు లేకపోవడంతో మార్టిన్‌ను అన్ని ఆరోపణల నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు న్యాయస్థానం స్పష్టం చేసింది.2004లో యూకే పర్యటనకు వెళ్లిన ఒక క్రికెట్ జట్టు సభ్యుడు వీసా గడువు ముగిసినా అక్కడే ఉండిపోయి, నకిలీ ఇమ్మిగ్రేషన్ స్టాంప్‌తో భారత్‌కు తిరిగి వచ్చాడు. ఈ ఘటనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లో చీటింగ్ (సెక్షన్ 420), ఫోర్జరీ (468), నకిలీ పత్రాలను ఉపయోగించడం (471), నేరపూరిత కుట్ర (120బీ) వంటి అభియోగాలతో పాటు పాస్‌పోర్ట్ చట్టంలోని సెక్షన్ 12 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో జాకబ్ మార్టిన్ పేరును చేర్చారు.అయితే, విచారణలో మార్టిన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి విశ్వసనీయమైన సాక్ష్యాధారాలను ప్రాసిక్యూషన్ సమర్పించలేకపోయింది. నకిలీ యూకే స్టాంప్, ప్రయాణ ఏర్పాట్లు, ఆర్థిక లావాదేవీలలో మార్టిన్ పాత్ర ఉందని నిరూపించడంలో విఫలమైంది. అజ్వా స్పోర్ట్స్ క్లబ్‌పై ఆయనకు నియంత్రణ ఉందని చెప్పడానికి కూడా ఆధారాలు లేవని కోర్టు అభిప్రాయపడింది. సాక్షులు కూడా ఆరోపణలను ధ్రువీకరించకపోవడంతో మార్టిన్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది.ఈ తీర్పు అనంతరం జాకబ్ మార్టిన్ మీడియాతో మాట్లాడుతూ తన ఆవేదనను పంచుకున్నాడు. "2004లో నా జట్టు యూకే పర్యటనకు వెళ్లింది. ఒక ఆటగాడు తప్ప అందరూ తిరిగి వచ్చారు. అతను వీసా గడువు దాటి అక్కడే ఉండిపోయి, నకిలీ స్టాంపింగ్‌తో తిరిగి వస్తుండగా ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుబడ్డాడు. అసలు ఎఫ్ఐఆర్‌లో నా పేరు లేదు. నేను అంతర్జాతీయ క్రికెటర్‌ను కావడం, నా పేరు పెద్దది కావడంతో విచారణ సమయంలో నన్ను ఈ కేసులో ఇరికించారు" అని మార్టిన్ తెలిపాడు."ఈ 22 ఏళ్లలో నేను తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొన్నాను. నా రైల్వే ఉద్యోగాన్ని కోల్పోయాను. బీసీసీఐ నుంచి కూడా ఎలాంటి స్పందన లేదు. ఇప్పుడు వచ్చిన ఈ క్లీన్ చిట్ నా జీవితానికి ఎంతో ఊరటనిచ్చింది. ఇది నా జీవితంలో ఒక పెద్ద మలుపు" అని అన్నాడు. కుడిచేతి వాటం బ్యాటర్ అయిన జాకబ్ మార్టిన్, భారత్ తరఫున 10 వన్డే మ్యాచ్‌లు ఆడి 158 పరుగులు చేశాడు.

## WTC ఫైనల్ రేసులో బిగ్ ట్విస్ట్ : 4 జట్లు ఔట్, డేంజర్‌లో మరో 3 టీమ్స్.. భారత్ సంగతేంటి?




లండన్ ది ఓవల్ మైదానంలో జూన్ 9వ తేదీ నుంచి జరిగే డబ్ల్యూటీసీ 2027 ఫైనల్ పోరుకు కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది. ఈసారి ఫైనల్ చేరాలంటే 65 శాతం పాయింట్లు సాధించడం తప్పనిసరి కావడంతో ఈ పోరు పీక్స్‌కి చేరింది. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్ టాప్--3లో పటిష్ఠంగా ఉంటే.. టీమిండియా ఐదో స్థానంలో కొనసాగుతుంది. మరోవైపు ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ ఆశలు గాల్లో కలవగా.. బంగ్లాదేశ్ ఊహించని విధంగా రేసులోకి దూసుకొచ్చింది. ఇండియా వరుసగా మరోసారి ఫైనల్ చేరాలంటే మిగిలిన 8 టెస్టులు అత్యంత కీలకంగా మారాయి. మరి టాప్--2లో నిలిచి ఆ ట్రోఫీని ముద్దాడే ఆ రెండు జట్లు ఏవో చూడాల్సిందే.

**వెస్టిండీస్ అవుట్.. పాకిస్తాన్, ఇంగ్లాండ్‌లకు డోర్లు క్లోజ్!**

ఈ సైకిల్‌లో వెస్టిండీస్ కథ ముగిసింది. 12 మ్యాచ్‌ల్లో రెండే గెలిచి విండీస్ 9వ స్థానానికి పడిపోయింది. ఇటు పాకిస్తాన్, ఇంగ్లాండ్ పరిస్థితి కూడా అంతే.. పాక్ ఫైనల్ రేసులో నిలవాలంటే మిగిలిన 7 టెస్టులు వరుసగా గెలవాల్సిందే. 13 మ్యాచ్‌లాడిన ఇంగ్లీష్ టీమ్ మిగిలిన ఎనిమిదింటిలో 8 నెగ్గినా అగ్రస్థానాలకు రావడం దాదాపు ఇంపాజిబుల్.. ఇక శ్రీలంక కూడా మిగిలిన 7 టెస్టులు తప్పక గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.

**డార్విన్ టెస్టులో మాస్ కంబ్యాక్.. రేసులోకి బంగ్లాదేశ్:**

ఎవరూ ఊహించని రీతిలో బంగ్లాదేశ్ జట్టు పాయింట్ల పట్టికను షేక్ చేసేసింది. డార్విన్ టెస్టులో ఆస్ట్రేలియాను చిత్తు చేసి చారిత్రక విజయం సాధించడంతో 66.67 శాతం పాయింట్లతో నాలుగో స్థానానికి దూసుకెళ్లింది. చేతిలో ఇంకా ఏడు టెస్టులు ఉండటం వాళ్లకు ప్లస్ పాయింట్. దీంతో ఆసీస్, సఫారీలతో పాటు బంగ్లా కూడా ఫైనల్ బెర్త్ కోసం గట్టిగా పోటీ పడుతుంది.

**భారత్ WTC ఫైనల్ చేరే లెక్కలు ఇవే:**

ప్రస్తుతం భారత జట్టు 10 మ్యాచ్‌ల్లో 5 విజయాలతో 53.33 శాతంరాజుతో ఐదో పొజిషన్లో కొనసాగుతుంది. మొత్తం 18 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో భారత్ ముందు ఇంకా 8 టెస్టు మ్యాచులున్నాయి. ఈ మ్యాచ్‌ల్లో అత్యంత నిలకడగా రాణిస్తేనే టీమిండియాకు ఓవల్ లో జరిగే ఫైనల్ బెర్త్ దక్కుతుంది. మరి ఈ ఐదు జట్ల మధ్య జరగబోయే యుద్ధంలో ఏ టీమ్ ని విజయం వరిస్తుందో చూడాల్సిందే.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776